1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

RNI : APTEL / 2023 / 89152

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక


Good for Health — Best for Readers — THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 153 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 17 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 153 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 17 April 2025 PAGES : 8 PRICE : 3/-

## రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల పై సీఎం చంద్రబాబు ప్రజంటేషన్

- రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వివరిస్తూ వీడియో ప్రదర్శన
- రాష్ట్ర పురోగతిపై ఫొటో ఎగ్జిబిషన్
- ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించిన సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 16)

రాష్ట్రానికి వచ్చిన 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు నాయుడు వివిధ అంశాలపై వీడియో ప్రజంటేషన్ ఇచ్చారు. వీటిలో ఏపీ ఏపీ వృద్ధికి అనుకూలతలు, స్వర్ణాంధ్ర-2047 విజన్, వినూత్న కార్యక్రమం పీ4 వంటి తదితర అంశాలు ఉన్నాయి.

**ఏపీ వృద్ధికి అనుకూలతలు..**

అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ తూర్పు దేశాలకు గేట్‌వేగా ఉంది. 3 పారిశ్రామిక కారిడార్లు, విశాఖ-చెన్నయ్, చెన్నై-బెంగళూరు, బెంగళూరు-హైదరాబాద్ కారిడార్లు ఉన్నాయి. 6 పోర్టులు, 7 ఎయిర్ పోర్టులు ఉన్నాయి. దేశ ఎగుమతుల్లో 5.8 శాతం రాష్ట్రం నుంచే అవుతున్నాయి. బ్లూ ఎకానమి, ఐటీ, నాలెడ్జ్ ఎకానమి, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్, ఐఓటీ, బ్లాక్ చెయిన్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందుంది.

గ్రీన్ హైడ్రోజన్, సోలార్, అమోనియా... ఇలా గ్రీన్ ఎనర్జీకి ఏపీ హబ్‌గా ఉంది. అటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు అమరావతికి చేరువలో ఉన్నాయి. ఈ నాలుగు నగరాలను కలుపుతూ దక్షిణ భారతదేశం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే వికసిత్ భారత్ లక్ష్యంలో భాగం అవుతుంది.

**స్వర్ణాంధ్ర-2047 విజన్..**

భారతదేశాన్ని 2047 కల్లా వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు విజన్ రూపొందించుకున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో పది సూత్రాల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి కనీస అవసరాలు తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఒక్క కుటుంబానికి సొంతిళ్లు, పరిశుభ్రమైన మరుగు దొడ్లు, కుళాయి కనెక్షన్, వంటగ్యాస్, సమృద్ధిగా విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, విద్యుత్ ఆదా చేసే వీధి లైట్లు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాం.

**వినూత్న కార్యక్రమం పీ4..**

జీరో పావర్టీ లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకునే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సమాజంలో అసమానతలు తొలిగేలా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. జనాభా వృద్ధిపైనా దృష్టి సారించాం.

**స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలు..**

ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ అవతరించేలా కృషి చేస్తున్నాం. అలాగే తలసరి ఆదాయం 42,000 వేల డాలర్లకు చేరడంతో పాటు ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, సగటు జీవిత కాలం 85 ఏళ్లు, అక్షరాస్యత 100 శాతం సాధించడం, నిరుద్యోగ రేటు 2 శాతానికి మించకుండా అభివృద్ధి చెందేలా చూస్తున్నాం.

**రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం..**

ప్రస్తుతం జీఎస్డీపీ రూ. 18.25 లక్షల కోట్లు ఉండగా... 2028-29 నాటికి రూ. 29.29 లక్షల కోట్లకు చేరుకోవాలనేది లక్ష్యం. ఇది సాకారం కావాలంటే 2029 కల్లా రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు రావాల్సి ఉంది.

**2014-15 నాటికి వివిధ రంగాల వాటా..**

2014లో రాష్ట్ర విభజనతో ఆదాయ వనరులు అన్నీ మిగతా 2లో

## అమరావతిపై కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 16)

రాజధాని అమరావతిపై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రైతుల భూముల ధర నిలవాలన్నా.. పెరగాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని చెప్పారు. బుధవారం మీడియాతో మంత్రి మాట్లాడారు."విదేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టాలంటే ఫ్లైట్ కనెక్టివిటీ ఉండాలి. అందుకే అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కట్టాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఎయిర్‌పోర్ట్ కోసం భూసేకరణ లేదా భూ సమీకరణ అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే అమరావతిలో పనులు ప్రారంభం అయ్యాయి. భూములిచ్చిన రైతు సోదరులకు ఎలాంటి అపోహలు వద్దు. ఇచ్చిన మాట ప్రకారం అన్నీ చేస్తాం. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తవుతుంది" అని పి.నారాయణ తెలిపారు.

## అమరావతికి రూ. 47,000 కోట్లు అవసరం

**రాజధాని అమరావతికి ఇంకా రూ. 47వేల కోట్లు అవసరమవుతాయని 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాజధానిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ. 77,249 కోట్లు అవసరం కాగా... వరల్డ్ బ్యాంక్, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా ఫండింగ్ రూ. 31,000 కోట్లు సమకూరాయని తెలిపారు. ఇంకా కావాల్సిన నిధులు రూ.47,000 కోట్లు అని వివరించారు.**




(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 16)

ఆంధ్రప్రదేశ్ అవసరాలు ఇవే..

1. పోలవరం-బనకచర్ల అనుసంధానం
2. తాగునీటి ప్రాజెక్టులు
3. ఐదు పర్యాటక హబ్‌లు(అమరావతి, విశాఖపట్నం, అరకు, తిరుపతి, రాజమహేంద్రవరం) ఐఐటీ తిరుపతిలో ఇంక్యుబేషన్ సెంటర్, బుద్ధిస్ట్ సర్క్యూట్, మిగతా 2లో

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 16)



హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది.చెట్లు కొట్టేసే ముందు 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారా? లేదా? స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. అనుమతులతోనే ఆ భూముల్లో జామాయిల్ తరహా చెట్లు, పొదలను మిగతా 2లో

## త్వరలో రాజకీయాల్లోకి వస్తా: రాబర్ట్ వాద్రా

**వరుసగా రెండో రోజు ఈడీ విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా**
**గాంధీ కుటుంబంలో భాగం కావటం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారని వ్యాఖ్య**
**బీజేపీలో ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్న రాబర్ట్ వాద్రా**



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 16)

త్వరలో తాను రాజకీయాల్లోకి వస్తానని రాబర్ట్ వాద్రా స్పష్టం చేశారు. హర్యానా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణను ఎదుర్కొంటున్నారు. వరుసగా రెండో రోజు ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరైన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు.ప్రజల కోసం నిత్యం పోరాడే గాంధీ కుటుంబంలో తాను భాగమని అన్నారు. దాని కారణంగానే తనను, తన కుటుంబాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కూడా ఛార్జీషీట్ దాఖలు చేశారని గుర్తు చేశారు. బీజేపీ తమను ఎంతగా ఇబ్బంది పెడితే అంతలా తాము బలపడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఎదురయ్యే ప్రతి సవాలును ఎదుర్కొని ముందుకు సాగుతామని వాద్రా అన్నారు. ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వం మిగతా 2లో

## చికుబుకు రైలుకు 172 ఏళ్లు.. మూడు ఇంజన్లతో తొలిరైలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 16)

: దేశంలో నిత్యం కోట్లాది మంది ప్రయాణికులకు సేవలందిస్తోన్న భారతీయ రైల్వే కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టింది. 1853 ఏప్రిల్ 16న ముంబయి నుంచి ఠాణెకు మొదలైన ఈ రైలు దేశంలో తొలిసారి ప్యాసింజర్ రైలుగా చరిత్రలో నిలిచిపోయింది. నేటితో 172 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశంలో వీటి ప్రారంభం గురించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తొలిరైలు మూడు ఇంజిన్లతో బయలుదేరిన విషయాన్ని గుర్తుచేశారు.



**భాషకు మతం లేదు.. పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీంకోర్టు**

"172 సంవత్సరాల క్రితం, 1853 ఏప్రిల్ 16న మూడు ఇంజిన్లతో కూడిన తొలి రైలు ముంబయిలోని బోరిబందర్ నుంచి ఠాణెకు ప్రయాణించింది. ఆ రోజు ముంబయిలో చరిత్రాత్మకమైంది. మిగతా 2లో

## అమిత్ షాను ప్రధాని మోదీ నియంత్రించాలి

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 16)



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. వక్ఫ్ (సవరణ) చట్టం-2025కి వ్యతిరేకంగా బెంగాల్‌లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారడంలో ఆయన హస్తం ఉందని ఆరోపించారు. ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన హింస అని.. ఇందుకోసం అమిత్ షా, బీఎస్ఎఫ్ కలిసి కుట్రపూరితంగా బంగ్లాదేశీయులను రాష్ట్రంలోని వదిలారని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష నేతలను భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. సొంత రాజకీయ అజెండాను మిగతా 2లో

## ఇక రైళ్లలోనూ ఏటీఎం సేవలు..

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 16)



షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెద్దపెద్ద కార్యాలయాల్లోనూ ఏటీఎం సేవలను చూస్తున్నాం. త్వరలో కదిలే ఏటీఎం లు కూడా రానున్నాయి. ప్రయాణికుల కోసం రైళ్లలోనూ ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా ఓ మార్గంలో వీటిని ప్రవేశపెట్టింది. సెంట్రల్ రైల్వే తొలిసారిగా ముంబయి-మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్ లో ప్రయోగాత్మకంగా ఏటీఎంను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.ప్రతి రోజు నడిచే ఈ ఎక్స్‌ప్రెస్‌లో.. ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు చెందిన ఏటీఎంను ఏసీ ఛైర్‌కార్ కోచ్‌లో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. త్వరలో పూర్తి స్థాయిలో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా దీనిని ఏర్పాటు చేసినట్లు సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా వెల్లడించారు. కోచ్‌లో గతంలో తాత్కాలిక ప్యాంట్రీగా మిగతా 2లో

మొదటి పేజీ తరువాయి



## రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల పై
# సీఎం చంద్రబాబు ప్రజంటేషన్

తెలంగాణకు వెళ్లాయి. కేవలం ప్రాథమికరంగంపైన మాత్రమే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ ఆధారపడాల్సి వచ్చింది. 2014లో ఏపీకి 31 శాతం ఆదాయం ప్రధానంగా వ్యవసాయ రంగం నుంచి వస్తే, తెలగాణ రాష్ట్రానికి 16 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది. అలాగే పరిశ్రమల రంగం నుంచి ఏపీకి 25 శాతం, తెలంగాణకు 22 శాతం, సేవల రంగం నుంచి ఏపీకి 44 శాతం, తెలంగాణ 61 శాతం వాటా ఉంది.

**2023-24 నాటికి వివిధ రంగాల వాటా..**

2023-24 నాటికి ఏపీ ఆదాయంలో వ్యవసాయరంగం వాటా 34 శాతం ఉంటే, భారతదేశానికి 20 శాతం, తెలంగాణకు 15 శాతం ఉంది. ఏపీలో పరిశ్రమల రంగం వాటా 24 శాతం ఉంటే, భారతదేశంలో 26 శాతం, తెలంగాణలో 18 శాతం ఉంది. ఏపీలో సేవలరంగం వాటా 42 శాతం ఉంటే, భారతదేశంలో 54 శాతం, తెలంగాణలో 67 శాతం ఉంది.

**ప్రధాన ఆదాయ వనరు లేదు..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాద్ ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయం ఏపీ కోల్పోయింది. దీంతో తెలంగాణకు ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇది తెలంగాణ వృద్ధికి, తలసరి ఆదాయం పెరుగుదలకు, ఏపీ వెనకబాటు తనానికి కారణమైంది.

**జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయం తక్కువ..**

దేశంలోని ముఖ్యమైన రాష్ట్రాలతో పోల్చుకుంటే జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయ వనరుల శాతం ఏపీలో తక్కువగా ఉంది. ఏపీలో 6.48 శాతం ఉంటే, తెలంగాణలో 9.51 శాతం, కేరళలో 8.49 శాతం, మహారాష్ట్రలో 7.93 శాతంగా ఉంది.

**విభజనతో నష్టం-పంపకాలు పెండింగ్..**

విభజనతో జాతీయ సంస్థలు, విద్య-వైద్య సంస్థలు, భారత ప్రభుత్వ సంస్థలు ఏపీకి లేకుండా పోయాయి. విభజన చట్టం షెడ్యూల్ 9 ప్రకారం 91 ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించి రూ.1.63 లక్షల కోట్లు, అలాగే షెడ్యూల్ 10 కింద ఉన్న 142 సంస్థలకు చెందిన రూ.39,191 ఆస్తుల పంపంకం అంశం రెండు రాష్ట్రాల మధ్య విభజన జరిగి పదేళ్లవుతున్నా ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

**తలసరి ఆదాయంలోనూ తలకిందులు..**

రాష్ట్రం విడిపోయే నాటికి 2014-15లో ఏపీ తలసరి ఆదాయం రూ. 93,903 ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104గా ఉండేది. మొదటి ఐదేళ్ల మా పాలనలో ఏపీలో తలసరి ఆదాయం 13.21 శాతం పెరిగి 2019కి రూ. 1,54,031కు చేరుకుంది. అదే కాలానికి తెలంగాణలో 13.37 శాతం పెరిగి రూ. 2,09,848 అయింది. 2019-24 మధ్య ఏపీలో తలసరి ఆదాయ వృద్ధి 9.18 శాతానికి పడిపోయింది. తెలంగాణలో మాత్రం 11.45 శాతం నమోదైంది. దీంతో 2023-24లో ఏపీ తలసరి ఆదాయం రూ. 2,37,951, తెలంగాణ తలసరి ఆదాయం రూ. 3,56,56 నమోదైంది. ఇలా రాష్ట్ర విభజన, గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా తలసరి ఆదాయంలో తెలంగాణకు, ఏపీకి వ్యత్యాసం భారీగా పెరిగిపోయింది. దక్షిణ భారత రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయమే అత్యంత తక్కువ.

**2019-24లో గాడితప్పిన వ్యవస్థ..**

గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం, ఆదాయ వృద్ధిపై దృష్టి పెట్టకపోవడం రాష్ట్రానికి భారీగా నష్టం కలిగించింది. రెవెన్యూ వ్యయంపై ఎలాంటి నియంత్రణ లేదు. 2024లో అధికారం చేపట్టేనాటికి మొత్తం రుణాలు రూ.9.74 లక్షల కోట్లకు ఉంది. దీనికి తోడు గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన బకాయిలు రూ.1.35 లక్షల కోట్లు ఉన్నాయి. మూలధన వ్యయం కూడా 2014-19లో 2.01 శాతం నుంచి 2019-24కి 1.38 శాతానికి తగ్గింది.

**ఈ 9 నెలల్లో గాడిలో పెట్టాం..**

2024లో అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం మిగిల్చిన రూ. 24,811 కోట్ల బకాయిలు చెల్లించాల్సి వచ్చింది. కేంద్ర ప్రాయోజిక పథకాలకు సంబంధించిన బకాయిలు రూ. 13,085 కోట్లు తీర్చాం. మూలధన వ్యయానికి సంబంధించి రూ. 13,314 కోట్లు చెల్లించాం. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు రూ. 3,339 కోట్లు ఖర్చు చేశాం. అమరావతి, పోలవరం, ఇండస్ట్రియల్ హబ్, పోర్టుల నిర్మాణం కోసం నిధులు భారీగా ఖర్చు పెడుతున్నాం.

**19 కొత్త పాలసీలు తీసుకువచ్చాం..**

రాష్ట్రాభివృద్ధి కోసం కొత్తగా 19 పాలసీలు ప్రవేశపెట్టాం. ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎంఎస్ఎంఈ, మేరిటైమ్, క్లీన్ ఎనర్జీ, టూరిజం, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీల ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాం.

**స్వర్ణాంధ్ర సాకారానికి వృద్ధి రేటే ఆధారం..**

స్వర్ణాంధ్ర విజన్ -2047 సాకారం కావాలంటే వృద్ధి రేటు 15 శాతం ఉంటేనే సాధ్యమవుతుంది. 15 శాతం తగ్గకుండా వృద్ధి నమోదు చేయగలిగితే జీఎస్డీపీ రూ. 347 లక్షల కోట్లకు చేరుతుంది. తలసరి ఆదాయం రూ. 58,14,916కు పెరుగుతుంది. అదే 12.50 శాతం వృద్ధి నమోదైతే జీఎస్డీపీ రూ. 214 లక్షల కోట్లు, తలసరి ఆదాయం రూ. 35,85,473 అవుతుంది.

**గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు..**

రాష్ట్రాల్లో గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు కేటాయించేటప్పుడు 70 శాతం వెయిటేజీ జనాభాకు, 20 శాతం వెయిటేజీ వ్యవసాయం, అనుబంధ రంగాలకు 10 శాతం వెయిటేజీ ప్రాంతానికి ఇవ్వాలని ప్రతిపాదన. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రూ.69,897 కోట్ల నిధులు అవసరం కాగా, రూ.7,381 కోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో రూ.62,516 కోట్ల నిధులు కావాల్సి ఉంది.

**పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు..**

పట్టణ, స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల కోసం రూ. 19,871 కోట్ల గ్రాంట్లు అవసరం అవుతుంది. అలాగే 2026-2031 మధ్య కాలానికి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రూ. 16,181 కోట్లు కావాల్సి ఉంది.

**ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ..**

క్లీన్ ఎనర్జీకి రాష్ట్రంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలని అనుకుంటున్నాం. 2030 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం. దీనికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం ఉంది. 7.5 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని సీఎం చంద్రబాబు 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యులకు వివరించారు.

## అమరావతికి
# రూ. 47,000 కోట్లు అవసరం

అమరావతిలో జాతీయ మ్యూజియం, విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు

4. నాలెడ్జ్ ఎకానమీలో భాగమైన క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు, స్కిల్ డెవలప్మెంట్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, 100 శాతం అక్షరాస్యత

5. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేలు, రహదారులు

6. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజనల్ గ్రోత్ సెంటర్లు... ఈ ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్లు ఇచ్చేలా సిఫార్సులు చేయాలని ఆర్థిక సంఘాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

# త్వరలో రాజకీయాల్లోకి వస్తా రాబర్ట్ వాద్రా

తప్పులను ఎత్తి చూపే వారిపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థలను దుర్వినియోగం చేస్తే, ఆ సంస్థలను ప్రజలు విశ్వసించరని ఆయన అభిప్రాయపడ్డారు. తాను బీజేపీలో ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని వ్యాఖ్యానించారు. ప్రజలు తనతో ఉన్నారని, త్వరలో రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో హర్యానా ప్రభుత్వం తనకు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. విచారణలో భాగంగా ఈడీ ఇప్పుడు అడుగుతున్న ప్రశ్నలకు తాను 2019లోనే సమాధానం ఇచ్చానని తెలిపారు. మళ్లీ ఇప్పుడు అవే ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారో అర్థం కావడం లేదని ఆయన అన్నారు.

# అమిత్ షాను ప్రధాని మోదీ నియంత్రించాలి

నెరవేర్చుకోవడానికి దేశానికి హాని చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ.. అమిత్‌షాను నియంత్రించాలని అన్నారు. ముర్షిదాబాద్ అల్లర్ల వెనుక సరిహద్దు అవతల నుంచి వచ్చిన వ్యక్తుల పాత్ర ఉందని నిఘా వర్గాలు తమకు తెలిపాయని మమత పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లోని ఘర్షణలకు సంబంధించిన దృశ్యాలను బెంగాల్‌లో జరుగుతున్నట్లు చెబుతూ సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దీదీ ఆరోపించారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో తమ పార్టీ ముందంజలో ఉందని అన్నారు. ఈ విషయంపై ప్రజలు శాంతియుత నిరసనలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయొద్దని ప్రధానిని కోరారు. హింసాకాండలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల నష్ట పరిహారం ఇస్తామని మమత ఈ సందర్భంగా ప్రకటించారు. ఘర్షణల్లో బీఎస్ఎఫ్ పాత్రపై దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హూగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసం చోటుచేసుకుంది. దీంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా నిరసన కారులను పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా.. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ ఇప్పటికే పదుల సంఖ్యలో పిటిషన్లు దాఖలు అయ్యాయి. వీటిపై సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ చేపట్టనుంది.

# ఇక రైళ్లలోనూ ఏటీఎం సేవలు..

ఉపయోగించిన స్థలంలో ఈ ఏటీఎంను ఏర్పాటు చేశారు. రైలు కదులుతున్నప్పుడు భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండటానికి దీనికి షట్టర్ డోర్‌ను కూడా అమర్చారు. ఇందుకు సంబంధించి కోచ్‌లో అవసరమైన మార్పులను మన్మాడ్ వర్క్‌షాప్‌లో చేపట్టినట్లు అధికారులు వివరించారు.పంచవటి ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినస్ నుంచి మన్మాడ్ జంక్షన్ వరకూ వెళ్తుంది. సుమారు 4.30 గంటల్లో గమ్యస్థానానికి చేరుకునే ఈ రైలు.. ఆ మార్గంలో కీలకమైంది. ఈ రైల్లో ప్రయోగాత్మకంగా ఏటీఎం సేవలను తీసుకొచ్చారు. త్వరలోనే మిగతా మార్గాల్లోని రైళ్లలోనూ ఏటీఎంలను ఏర్పాటు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

తొలగించినట్లు ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ తెలిపారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని.. దాని ప్రకారం ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ చెప్పారు. అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టివేసినట్లు తేలితే సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. 1996 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు ఏమాత్రం విరుద్ధంగా వ్యవహరించినా చూస్తూ ఊరుకోబోమన్నారు.రూ.10వేల కోట్లకు మార్టిగేజ్ చేశారని సీఈసీ నివేదికలో చెప్పిందని అమికస్ క్యూరీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములను మార్టిగేజ్ చేశారా.. అమ్ముకున్నారా? అనేది తమకు అనవసరమని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. చెట్లు కొట్టివేసే ముందు అనుమతి ఉందా? లేదా? అనేది మాత్రమే ముఖ్యమని చెప్పారు. 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి.. ఆ తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి తదితర వివరాలను అభిషేక్ మను సింఘ్వీ వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేసింది.

# చికుబుకు రైలుకు 172 ఏళ్లు.. మూడు ఇంజన్లుతో తొలిరైలు

ఆ రోజు అక్కడ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మధ్యాహ్నం 3.35గంటలకు 14 కోచ్‌లతో కూడిన రైలు ముంబయిలోని బోరిబందర్ నుంచి ఠాణెకు ప్రయాణించింది. 21 తుపాకీలతో సెల్యూట్ చేశారు. ఆహ్వానం ఉన్న 400 మంది అందులో ప్రయాణించారు. సింధ్, సుల్తాన్, సాహెబ్ పేర్లు కలిగిన మూడు ఇంజిన్లతో రైలు ప్రారంభమైంది. 34 కి.మీ దూరాన్ని 1 గంట 15నిమిషాల్లో చేరుకుంది. అప్పటి నుంచి భారతీయ రైల్వే సేవలు అందిస్తూనే ఉంది" అని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తొలి రైలు వెళ్తున్న చిత్రంతోపాటు ఇటీవల దేశంలో నిర్మించిన మూడు అద్భుత రైల్వే వంతెనల ఫొటోలను ఆయన పోస్టు చేశారు.

# పరీక్షలకు అనుమతి ఇవ్వాలి

### కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్‌లకు సూచించిన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)**

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద అర్హత కలిగి వున్న విద్యార్థులకు హాల్ టిక్కెట్లు జారీచేసి వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తరగతులు, పరీక్షలకు హాజరు కావడానికి అనుమతి ఇవ్వాలని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్ వారికి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లాలోని వివిధ కళాశాలల యాజమాన్యం విద్యార్థులను పరీక్షలు రాయడానికి అనుమతించకుండా, కళాశాల ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వారిని ఇంటికి తిరిగి పంపిస్తున్నారని, కోర్సు పూర్తయినా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టుచున్నారని, డిటైన్డ్/డిస్కంటిన్యూ అయిన విద్యార్థులకు కూడా సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టుచున్నారని, చాల మంది విద్యార్థులు ఫిర్యాదులు చేయుచున్నారు. వివిధ దిన పత్రికల యందు ప్రచురించబడుతున్నది. విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద ఫీజు రీయింబర్స్ మెంట్‌కు అర్హులు అయినప్పటికీ కూడా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అన్యాయమైన చర్యల వల్లన విద్యార్థులు తమ కళాశాల విద్యను విడిచిపెట్టి, ప్రత్యామ్నాయ జీవనోపాధిని కోరుకునేలా దారి తీస్తుంది. కళాశాల యాజమాన్యం వారి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు, అర్హత కలిగిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను కూడా ఉల్లంఘిస్తోంది. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఆంక్షలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, కొన్ని కళాశాలలు కోర్సు పూర్తయిన తర్వాత కూడా విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని మా దృష్టికి వచ్చింది. ఈ పద్ధతి ఆమోదయోగ్యం కాదు, ఎందుకంటే ఇది విద్యార్థుల కెరీర్ అవకాశాలను కొనసాగించే సామర్థ్యాన్ని అడ్డుకుంటుంది. జీవోఎం 81. సోషల్ వెల్ఫేర్ (ఎడిషన్.2) విభాగం, తేదీ 07.05.2019 లో పేరా నం. 7.2.4 నందు స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యా సంస్థలు నిలిపివేయడాన్ని నిషేధించాలని స్పష్టంగా ఆదేశించబడిందన్నారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్ వారికి తెలియజేయునది ఏమనగా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద అర్హత కలిగి వున్న విద్యార్థులకు హాల్ టిక్కెట్లు జారీచేసి వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తరగతులు, పరీక్షలకు హాజరు కావడానికి అనుమతి ఇవ్వాలి. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరుల కోసం వేచి ఉండకుండా, కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థుల సర్టిఫికెట్లను వారికి ఇవ్వవలెను, ఇలాంటి చర్యల ద్వారా విద్యార్థులకు అనవసరమైన అసౌకర్యాన్ని కలిగించకుండా, చదువులను అకస్మాత్తుగా ముగించడానికి దారితీయకుండా జాగ్రత్త వహించండి. పైన తెలిపిన ఆదేశాలను ఉల్లంగించిన కళాశాలలపై అవసరమైన చర్య తీసుకోవడానికి ఏపీఎస్‌సీహెచ్‌ఈ,యుజీసీ సిఫార్సులు సమర్పించబడతాయన్నారు. కఠిన చర్యలు తీసుకొనబడతాయన్నారు. గతంలో ఎల్ఆర్ ఆర్‌సీ నంబర్ ఏ9/54/2024. డీటీ.24.11.2024 ద్వారా అన్ని కళాశాలకు తెలిపినట్లు గుర్తు చేశారు.

# గర్భిణులు ఆహారం, ఆరోగ్య సంరక్షణ వంటి విషయాల్లో జాగ్రత్త తీసుకోవాలి




**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 16)**

మండల కేంద్రమైన అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి అధ్యక్షతన బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ గర్భిణులు ఆహారం, విశ్రాంతి, వ్యాయామం, ఆరోగ్య సంరక్షణ వంటి విషయాలలో జాగ్రత్త తీసుకోవాలని రోజు అల్పాహారం, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాలు తినాలని, నీరు ఎక్కువగా తాగాలని, ఆకుకూరలు పండ్లు, పాలు, తీసుకోవాలని, నిద్రపోయేటప్పుడు వీలైతే ఎడమవైపు పడుకోవాలని ఆమె తెలిపారు అనంతరం గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ కేంద్రంలో శ్రీమంతం చేశారు ఈ కార్యక్రమంలో ఎం మధురవాణి, కే రాధ, ఎస్.కె గౌస్య, ఏ డబ్ల్యు హెచ్. ఎస్ హెచ్ షాజ్మా, ఏఎన్ఎం హరిత, పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# హజ్ కార్పొరేషన్‌లో హాజీ హసన్ బాష ఉన్నతమైన సేవలందించాలి

### ప్రకాశం జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)**

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన హాజీ హసన్ బాషకు తన హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని ప్రకాశం జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ మీపై నమ్మకంతో మీకు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. వారి సహాయ, సహకారాలతో రాష్ట్ర హజ్ కార్పొరేషన్‌లో ఉన్నతమైన సేవలందించాలని, రాబోవు కాలంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని షేక్ రసూల్ మహమ్మద్ ఆకాంక్షించారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం




# బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 16)

బాల్య వివాహాలు లేని జిల్లాగా ప్రకాశం జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలు సందర్భంగా బుదవారం కనిగిరి ఎంపిడిఓ కార్యాలయంలో గర్భిణులకు నిర్వహించిన సామూహిక శ్రీమంతాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎపి పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపిపి డి ప్రకాశం, ఆర్డిఓ కేశవర్ధన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 8నుంచి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహిస్తున్న 7వ పౌష్టికాహార పక్షోత్సవాల్లో (పోషణ్ పఖ్వాడా) భాగంగా బుధవారం "మాతా శిశు సుఖీభవ" సామూహిక శ్రీమంతం వేడుకలు నిర్వహించడం, తల్లిపాలు పై అవగాహన, కౌన్సెలింగ్ ఇవ్వడం, సెక్రటేరియట్ స్థాయిలో విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డే నిర్వహించడం జరుగుచున్నదన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మొదటి 1000 రోజుల (గర్భస్త దశ నుండి 2 సంవత్సరాల వరకు సంరక్షణపై శ్రద్ధ వహించుట, గర్భిణీ తల్లికి హిమోగ్లోబిన్ స్థాయిని మెరుగుపరచడం, గర్భిణీ తల్లి ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించడానికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడం, తల్లి ,బిడ్డను కాపాడటానికి కుటుంబం, సమాజం నుండి మద్దతును నిర్ధారించడం, మెరుగైన పోషకాహారం మరియు సకాలంలో టీకాలు వేయడం, తల్లి మరియు శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, శిశువు , చిన్న పిల్లలకు పౌష్టికాహార పద్ధతులపై తల్లి మరియు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం మన్నారు. రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా జరుగుచున్నవన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టుటకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నేడు ప్రవేటు వైద్యశాలల్లో కంటే ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి మాట్లాడుతూ మన బిడ్డల భవిష్యత్ బాగుండాలని బంగారు బాల్యం పేరుతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుచున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ గర్భవతులు, బాలింతలు ఆరోగ్యమైన జీవనం సాగించాలన్నారు. ఎపి పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డా నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఆడబిడ్డలకు గర్భం దాల్చిన సమయం నుండి ప్రసవం అయ్యేంత వరకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకునేలా ఆనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. బిడ్డ పుట్టిన మొదటి రోజు నుండి మంచి పౌష్టకాహారం తీసు కుంటూ, వైద్యుల సలహాలు సూచనలు తప్పక పాటిస్తూ ఆరోగ్యమైన బిడ్డలను సమాజానికి అందించాల్సిన బాధ్యత ప్రతి తల్లిపై ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్థానిక శాసన

(తరువాయి 4లో...)

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 16)

తెలుగు ప్రజల గౌరవం కోసం, హక్కుల కోసం, తెలుగు వారి భవిష్యత్తు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని మనం ఎప్పటికినీ మరచిపోలేమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కనిగిరిలోని ఎంబిఆర్ కళ్యాణ మండలంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను కనిగిరి ప్రాంతంలో ఘనంగా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రకాశం జిల్లాలోని కనిగిరి ప్రాంతానికి దగ్గరగా ఉన్నటువంటి పిసి పల్లి మండలం, పడమటి పల్లె గ్రామం అమరజీవి పొట్టి శ్రీరాములు పూర్వీకులది కావడం జిల్లా ప్రజల అదృష్టంగా భావించవచ్చున్నారు. ఆయన తెలుగు ప్రజల గౌరవం కోసం, హక్కుల కోసం, తెలుగు వారి భవిష్యత్తు కోసం వారు చేసినత్యాగాన్ని మనం ఎప్పటికినీ మరచిపోలేమన్నారు. ఆయన చేసిన 58 రోజుల నిరాహార దీక్ష , ప్రాణ త్యాగం వలన కేంద్ర ప్రభుత్వం ఆనాడు తెలుగు వారికి ప్రత్యేకంగా రాష్ట్రాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మరచిపోలేం

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



ఆయన భాషా కోసమే కాకుండా సామాజిక సమానత్వం కోసం అదేవిధంగా పేదల పక్షాన నిలిచి మహాత్మాగాంధీ గారి స్ఫూర్తితో అనేక ఉద్యమాలు చేసి అణగారిన వర్గాల ప్రజల కోసమా పనిచేసి గాంధేయవాదిగా నిలిచిపోయారన్నారు. వారి స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచంలో మొదటి స్థానంలో నిలిపేందుకు స్వర్ణాంధ్ర 2047 విజన్ ను తీసుకువచ్చి, అన్ని రంగాల్లో ఆంధ్రపదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పి4 అనే వినూత్న కార్యక్రమాన్ని దేశంలోనే మొట్టమొదటగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రెండు కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి సాధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు (తరువాయి 4లో...)

### గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక లబ్ధి

# ఇంటికల సాకారం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 16)



గృహ నిర్మాణ లబ్ధిదారులకు యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పివిటిజి(ఆదివాసి గిరిజనులకు) లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తోందని, కావున లబ్దిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఈ అదనపు ఆర్థిక లబ్ది సదవకాశాన్ని వినియోగించుకొని తమ సొంత ఇంటికలసాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం కనిగిరి మున్సిపల్ పరిధిలోని అర్బన్ హౌసింగ్ కాలనీని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాల పురోగతి వివరాలను హౌసింగ్ శాఖ అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ అర్బన్ హౌసింగ్ కాలనీలో 1390 ప్లాట్స్ వేయగా, 544 మందికి ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందని, అందులో 128 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలిన ఇల్లు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహనిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు అధనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పివిటిజి(ఆదివాసి గిరిజనులకు) లకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తోందని తెలిపారు. కావున లబ్ధిదారులందరు ప్రభుత్వం అందిస్తున్న ఈ అదనపు ఆర్థిక లబ్ది సదవకాశాన్ని వినియోగించుకొని తమ సొంత ఇంటికల సాకారం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ కాలనీవాసులు అంతర్గత రహదారులు నిర్మించాలని, మంచినీటి సదుపాయం కల్పించాలని జిల్లా కలెక్టర్ వారికి విన్నవించగా, (తరువాయి 4లో...)

# వైపాలెం ఏఎంసీ చైర్మన్‌గా చేకూరి

### ముందే చెప్పిన షణ్ముఖ వెలుగు దినపత్రిక

### బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్న అభిమానులు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఏప్రిల్ 16)



యర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ అధిష్టానం చేకూరి సుబ్బారావును ఎంపిక చేసింది. నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు కీలకంగా వ్యవహరించడంతో ఈ పదవి సుబ్బారావుకు వరించింది. ప్రస్తుతం చేకూరి సుబ్బారావు యరగొండపాలెం మండల టిడిపి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీలో ఆయనకు ఉన్న పట్టుదల, నిబద్ధత, ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ దఅష్ట్యా, టిడిపి నాయకత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సుబ్బారావు ఎఎంసీ చైర్మన్‌గా ఎంపిక చేపట్టడం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి ఆయన మరింత కృషి చేస్తారని నమ్మకం వ్యక్తమవుతోంది. చేకూరి సుబ్బారావుకు ఏఎంసి చైర్మన్ గిరి దక్కనుందని షణ్ముఖ వెలుగు దిన పత్రిక ముందే చెప్పింది. గత ఏడాది డిసెంబర్ 28వ తేదిన షణ్ముఖ వెలుగు దిన పత్రికలో "సుబ్బారావుదే చైర్మన్ పీఠం" అంటూ ప్రచురించింది. ప్రస్తుతం అదే నిజమైంది. సుబ్బారావుకే చైర్మన్ పీఠం దక్కనుంది. యర్రగొండపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పదవి కోసం ఎవరికి వారు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్ధి తాటిపర్తి చంద్రశేఖర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టింది. దీంతో ఇక్కడ టిడిపి ఇంచార్జిగా వ్యవహరిసస్తున్న ఎరిక్షన్‌బాబుదే హవా సాగుతుంది. ఈ నేపథ్యంలో యర్రగొండపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా పలువురు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో మొదట్లో చైర్మన్ పదవి ఎస్టీలకు రిజర్వు అయినట్లు ప్రచారం జరిగింది. అయితే ఆ తర్వాత అది కాస్తా జనరల్‌కు కేటాయించడంతో చైర్మన్ గిరిపై అందరి కళ్లు పడ్డాయి. మఖ్యంగా చైర్మన్ గిరి కోసం కమ్మ సామాజికవర్గంతో పాటు రెడ్డి సామాజిక వర్గం కూడా తమకంటే తమకు కావాలంటూ ప్రయత్నాలు చేశారు. అయితే రాష్ట్ర పార్టీ సైతం మొదటగా కమ్మ సామాజిక వర్గానికే చైర్మన్ పదవిని కట్టబెట్టాలంటూ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి ఎరిక్షన్‌బాబు కూడా మొదటగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికే అవకాశం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీంతో కమ్మ సామాజిక వర్గంలోనే గట్టి పోటీ నెలకొంది. (తరువాయి 4లో...)

# 90 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ తహశీల్దార్, విఆర్ఓ

### మరణ ధృవీకరణ పత్రానికి రూ.90 వేలు డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)



రూ.90 వేలు లంచం తీసుకుంటూ మద్దిపాడు తహశీల్దార్ సృజన్ కుమార్, దొడ్డవరం విఆర్ఓ అంకమ్మరావులను ఎసిబి అధికారులకు పట్టుబడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎసిబి డిఎస్పీ శిరీష తెలిపిన వివరాల మేరకు దొడ్డవరం గ్రామానికి చెందిన వి అంకమ్మరావు భార్య అంజమ్మ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. ఆస్తి అమ్మే విషయంలో అంకమ్మరావుకు తన భార్య అంజమ్మ డెత్ సర్టిఫికేట్ అవసరం అయ్యింది. హైదరాబాద్‌లో కాకుండా లేట్ డెత్ సర్టిఫికేట్ తీసుకునేందుకు ముందుగా స్థానిక గ్రామ పంచాయతీలో ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న కార్యదర్శిని కలిశాడు. తాను సర్టిఫికేట్ మంజూరు చేయలేనని చేతులెత్తేశాడు సదరు కార్యదర్శి. అనంతరం బాధితుడు (తరువాయి 4లో...)

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మరచిపోలేం











సంకల్పంతో పనిచేసినప్పుడే అమరజీవి పొట్టి శ్రీరాములుకి మనమంతా నిజమైన నివాళులు అర్పించిన వారమౌతామన్నారు. ఏపి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, కనిగిరి ఎమ్మెల్యే డా ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, తదితరులు మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన అమరజీవి పొట్టి శ్రీరాములు ఈ ప్రాంత వాసులు కావడం ఎంతో సంతోషకరమన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడై, మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ పర్యటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం అమూల్యమైన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా 58 రోజుల పాటు ఆమరణ



నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరిన్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి జీవిత చరిత్రను తప్పని సరిగా పాత్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ మాలల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ చరిత్ర గతిని మార్చిన అమరజీవి పొట్టి శ్రీరాములు లాంటి మహనీయుల జీవిత చరిత్రలను భవిష్యత్ తరాలకు తెలియచేయాలసిన అవసారం ఉందన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు కేవలం ఆర్య వైశ్యులకు చెందిన వ్యక్తి కాదని, ఆయన జాతి సంపద అని అన్నారు. ఎపి ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ రాకేష్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు యొక్క త్యాగాన్ని గుర్తుచేసి వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దర్శి, వై పాలెం నియోజక వర్గాల ఇంచార్జీలు డా గొట్టిపాటి లక్ష్మీ, ఎరెక్షన్ బాబు,పలువురు, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వారసులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనేక ప్రాంతాల నుండి వచ్చిన ఆర్య వైశ్యులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలలో విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్ పెంచాలి



(షణ్ముఖ వెలుగు, కొమరోలు, ఏప్రిల్ 16)

మండలంలోని అల్లీనగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వీడ్కోలు ఫంక్షన్ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా పాల్గొన్న అల్లినగరం కాంప్లెక్స్ చైర్మన్ దాసరి గురుస్వామి మాట్లాడుతూ అల్లినగరం కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు , ఉపాధ్యాయులు 2025- 26 విద్యా సంవత్సరానికి ఎన్రోల్మెంట్ బాగా పెంచడానికి ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులను పెద్దలను కలిసి మాట్లాడి పాఠశాలలో విద్యార్థులు సంఖ్యను పెంచుటకు కృషి చేయాలని, బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్చుకోవాలని దాసరి గురుస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లినగరం కాంప్లెక్స్ పరిధిలోని ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయురాలు జి విజయ కుమారి, ఉపాధ్యాయులు వై వెంకటేశ్వరరెడ్డి, ఏ సురేంద్ర, పి శౌరి, జి సంధ్య, లక్ష్మి, సిహెచ్ శ్రీనివాసులు, తిరుమలరెడ్డి, సుధాకర్ బాబు, ఎస్ఎండి సుభాని, బాల వెంకటరెడ్డి, ఎన్ వి నారాయణ, సిఆర్పి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 16)

కనిగిరిలోని ఎం.బి.ఆర్ కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీ రాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీ రాములు 125వ జయంతి ఉత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనిగిరి మానవతా శాఖ సేవా కార్యక్రమం నిర్వహించాలని సంకల్పంతో, టౌన్ ఫస్ట్ , రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విజేత విద్యార్థినులకు రూ. 20,000 నగదును వారికి కలెక్టర్, ఎమ్మెల్యే ద్వారా అందించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, కనిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి , కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ షేక్, కనిగిరి విజేత ఐ.ఐ.టి అండ్ నీట్ అకాడమీ విద్యాసంస్థలో విద్యాభ్యాసం చేస్తూ సీనియర్ ఇంటర్‌లో అత్యధిక రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన జి. కీర్తన (ఎం. పి. సి. 9,90/1000) షేక్.నజ్మా( బై.పి.సి. 989/1000), సయ్యద్ అస్మిన్ ( బై.పి.సి 988/1000)అను విద్యార్థినులకు పారితోషకాలు ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అందజేశారు.

## హైదరీక్లబ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే దామాచర్ల

క్లబ్ అభివృద్ధికి సహకరిస్తానని హామీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

ఒంగోలు హైదరి క్లబ్ షాపింగ్ కాంప్లెక్స్‌కి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు భూమి పూజకు శంకుస్థాపన చేశారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో హైదరి క్లబ్ దినదినాభివృద్ధి చెందడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. సభ్యత్వ నమోదు వేగవంతం చేసి హైదరి క్లబ్ ను అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే తో పాటు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, నగర మేయర్ గంగాడ సుజాత తదితరులు భూమి పూజ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరి క్లబ్ కార్యదర్శి డాక్టర్ గుండవరపు రాఘవ ఉపాధ్యక్షులు నాగిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ట్రెజరర్ జీవీ ఆంజనేయులు , జాయింట్ సెక్రటరీ ఈదుపల్లి గురునాథరావు, మెంబెర్స్ ఎండి సుల్తాన్ బేగ్, ఎం శ్రీధర్, కే వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ,స్విమ్మింగ్ పూల్, ఆడిటోరియం, క్యారం, చెస్, షటిల్ షాపింగ్ కాంప్లెక్స్ తదితర నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, టిడిపి నాయకులు బండారు మదన్, రాజ్ విమల్, దాయినేని ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

## వైపాలెం ఏఎంసీ ఛైర్మన్‌గా చేకూరి

చేకూరికే ఏఎంసి పీఠం

యర్రగొండపాలెం మండల టిడిపి కన్వీనర్‌గా పని చేస్తున్న చేకూరి సుబ్బారావు ఛైర్మన్ పదవి కోసం పోటీ పడ్డారు. ఆయన కూడా టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేస్తున్నారు. మొగుళ్లపల్లి పంచాయితీ సర్పంచ్‌గా పని చేశారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయం నుంచి ఆయన టిడిపి యర్రగొండపాలెం మండల కన్వీనర్‌గా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని పని చేశారు. జరిగిన ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం యర్రగొండపాలెం మండలంలో విశేషంగా కృషి చేశారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి ఎరిక్షన్‌బాబు ఈ పాటికే ఒకరి పేరును ఖరారు చేస్తూ రాష్ట్ర పార్టీకి పంపించారు. అయితే ఇది బయటకు పొక్కకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటూనే ఛైర్మన్ గిరి ఎవరికి వరించినా అందరూ కలిసికట్టుగా పని చేసుకోవాలంటూ పోటీదారులకు సంకేతాలిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ కమిటి ఛైర్మన్‌లకు సంబంధించిన రెండు జాబితాలు ప్రకటించారు. ఎట్టకేలకు మూడు జాబితా బుధవారం సాయంత్రం వెలువడింది. అందులో యర్రగొండపాలెం ఏఎంపి ఛైర్మన్‌గా చేకూరికి స్థానపం దక్కింది. దీంతో టిడిపి శ్రేణులు టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ క్రమంలో ముందే చెప్పిన షణ్ముఖ వెలుగు కథనం నిజం కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




### సీఎం చంద్రబాబు, డీప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎరిక్షన్ బాబుకి ధన్యవాదాలు తెలిపిన చేకూరి

యర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవిని రాష్ట్ర ప్రభుత్వం యర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావుని నియమించింది. ఈ సందర్భంగా ఈ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి కేడర్‌లో నూతన జోష్ నెలకొంది, కష్టానికి తగిన గుర్తింపుని ఎరిక్షన్ బాబు కల్పించారని కేడర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం యర్రగొండపాలెం సెంటర్‌లో బాణా సంచా కాల్చి అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.




## 90 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ తహశీల్దార్, వీఆర్ఓ



అంకమ్మరావు తహశీల్దార్ కార్యాలయంలో మరణ ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కావాల్సిన వివరాలను అందించారు. తహశీల్దార్ కార్యాలయ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో అంకమ్మరావు భార్య పేరుతో ఉన్న ఆస్తి విలువ కోట్లలో ఉన్నట్లు గుర్తించారు. ఇంకేముంది మరణ ధృవీకరణ పత్రం మంజూరుకు దొడ్డవరం విఆర్ఓ కె అంకమ్మరావు రూ. 90 వేలు ఇస్తే పని చేస్తానని తహశీల్దార్ సృజన్‌కుమార్ చెప్పాడని బాధితుడికి వివరించాడు. దీంతో గత్యంతరం లేక బాధితుడు ఎసిబి అధికారులను కలిసి పరిస్థితి వివరించాడు. బుధవారం ఎసిబి అధికారుల సూచనల మేరకు నగదు ఇచ్చేందుకు తహశీల్దార్ వద్దకు వెళ్ళాడు. తహశీల్దార్ డెత్ సర్టిఫికేట్ మంజూరు చేస్తానని సదరు రూ. 90 వేల నగదును దొడ్డవరం విఆర్ఓ అంకమ్మరావుకు నగదు అందజేయాలని బాధితుడికి వివరించారు. సదరు బాధితుడు నగదును విఆర్ఓకు అందించే క్రమంలో ఎసిబి డిఎస్పీ శిరీష ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహశీల్దార్, విఆర్ఓ ల పై కేసు నమోదు చేసి నెల్లూరు జైలుకు తరలించారు.

## బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి





సభ్యులు గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక లబ్ధి ఇంటికల సాకారం చేసుకోవాలి




జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సదరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహం నిర్మాణ లబ్ధిదారులకు అదనంగా ఇస్తున్న ఆర్థిక సహాయం వివరాలను లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమెనిటిస్, సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఏపీ పర్యటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫూర్, ఆర్డిఓ కేశవర్ధన్‌రెడ్డి, హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, ఎంపిడిఓ, తహసీల్దార్, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది ఉన్నారు.

# కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పరుగులు

## మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 16)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుందని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వృద్ధిరేటును దారుణంగా పాతాళానికి తొక్కిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుంది. 2014-2019 మధ్య ఆశాజనకంగా వృద్ధిరేటును తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని దేశంలోనే ఉన్నంత స్థానంలో నిలబెట్టారు. 2019లో ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన జగన్ వృద్ధిరేటును దారుణంగా దెబ్బతీశారు. 2014 -2019 మధ్య రాష్ట్ర స్థూల ఉత్పత్తి ( జి ఎస్ డి పి ) వృద్ధిరేటు 13.5% ఉంటే, జగన్ రెడ్డి అసమర్థ, అరాచక పాలన వలన వృద్ధిరేటు 10.32 శాతానికి పడిపోయింది. జగన్ రెడ్డి బృందం దోపిడీ, దుబారాలతో గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రం అధోగదిపాలయ్యింది. రాజధాని అమరావతి ని భ్రష్టు పట్టించి పోలవరాన్ని మూలపడేలా చేశారు. ఖనిజ సంపదను నిలువు దోపిడీ చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితికి తీసుకువచ్చారు. దేశంలోనే అప్పుల భారం అధికంగా ఉన్న రాష్ట్రాలలో ఆంధ్ర ప్రదేశ్ మొదటి స్థానంలో నిలబెట్టిన ఘనత జగన్ రెడ్డికి దక్కుతుంది. జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా కుదేలయింది. పారిశ్రామికంగా ఒక పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేందుకు భయపడింది. 2014 -2019 అధికారంలో చంద్రబాబు అనుభవంతో తీసుకువచ్చిన అనేక పరిశ్రమలను జగన్ రెడ్డి తరిమి వేశారు. వ్యవసాయ ఆధారిత ఆంధ్రప్రదేశ్లో రైతులను నట్టేట ముంచిన చరిత్ర మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుంది. అన్ని రంగాలను నాశనం చేసే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారు చేసిన ప్రభుత్వం జగన్ సర్కార్. 2024 ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు జగన్ కు బుద్ధి చెప్పి చంద్రబాబుకు ప్రభుత్వ పగ్గాలు అప్పు చెప్పారు. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత పతనమైన వృద్ధిరేటు అభివృద్ధి వైపు పరుగులు తీస్తుంది. గత ప్రభుత్వంలో దేశంలోనే అట్టడుగు స్థాయిలో ఉన్న వృద్ధిరేటు ప్రస్తుత ఆశాజనకంగా రెండో స్థానానికి చేరడం చంద్రబాబు పనితీరుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి పనులు చేస్తూనే మరోవైపు ఆదాయ వనరులు పెంపు వైపు అడుగులు వేస్తుంది. సంపద సృష్టించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలుసిద్ధం చేస్తుంది. దేశంలోనే ఆదర్శవంతమైన రాజధాని రూపకల్పనకు చంద్రబాబు లక్ష కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు. వచ్చే నెలలో ప్రధానమంత్రి మోడీ చేతులు మీదుగా ఈ పనులకు శ్రీకారం చుడుతున్నారు. రాజధానిలో అత్యాధునిక హక్కులతో రైల్వే స్టేషన్, విమానశ్రయం అందుబాటులోకి వస్తున్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు ఏపీకి వచ్చేందుకు భయపడ్డారు. ప్రస్తుతం చంద్రబాబు చొరవతో ఏపీలో నాలుగు లక్షల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఏపీకి వచ్చారు. ఏపీని. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా మార్చేందుకు 2047 లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. 15% వృద్ధిరేటుతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నీ అగ్రగామిగా నిలవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. దేశంలో ఏ రాష్ట్రానికి లేనంతగా సముద్ర తీరం ఆంధ్రప్రదేశ్ సొంతం. ప్రస్తుతం జాతీయ రహదారులు సముద్ర తీరం వెంట ఉన్న పోర్టులకు అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా సముద్రతీరం రవాణా ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆదాయం సంపాదించేందుకు మార్గం సుఖము అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి ఏపీ కూటమి ప్రభుత్వ.ఎంపీలు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో తమదైన పాత్ర విజయవంతంగా పోషిస్తున్నారు. 75సంవత్సరాల వయసులోనూ నిరంతరంగా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రాజధాని పనులు తిరిగి శ్రీకారం చుట్టే నేపథ్యంలో సరికొత్త అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసిన జగన్ పార్టీకి కూటమిని విమర్శించే స్థాయి లేదు. కనీసం అసెంబ్లీకి వచ్చి ప్రజల తరఫున మాట్లాడే ప్రయత్నం చేయని జగన్ కు ప్రజలు ఎందుకు మద్దతు ఇవ్వాలో చెప్పాలి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ప్రతిపక్ష నాయకుడు జగన్ ఇకనైనా తన బుద్ధి మార్చుకోవాలి. లేదంటే రానున్న ఎన్నికల్లో ఈ 11 సీట్లు కూడా మిగలవు అని యాగంటి మల్లికార్జునరావు, తెలిపారు. ఈ సమావేశంలో తిక్క కొండల్,దుర్భకుల ప్రసాద్, బ్రహ్మం, గాజుల అంజి, మస్తాన్, బొట్టు కోటేశ్వరరావు,శివ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు విడుదల చేయాలి

### సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలి

### మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

మున్సిపల్ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ ఒంగోలు నగర్ కమిటీ ఆధ్వర్యంలో, నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి నగర అధ్యక్షులు జి నరసింహ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఒంగోల్ నగర్ కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ పారిశుద్ధ్య భాగంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు గత రెండు మాసాల నుండి వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. అలాగే 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు వారి కుటుంబ సభ్యుల్ని విధుల్లోకి తీసుకోవాలని, కోవిడ్ ద్వారా పనిచేసే కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని తీసుకోవాలని, సెలవులు వర్తింప చేయాలని పిఎస్ఐ రికార్డులు సరిచేయాలని, ఎక్కడ ఉన్న అధికారులు వెంటనే స్థానిక సమస్యల జోక్యం చేసుకోవాలని చేసుకొని పరిష్కరించాలని కోరారు. ధర్నా అనంతరం అసిస్టెంట్ కమిషనర్ కొండయ్యని యూనియన్ తరపున కలిసి వినత పత్రం ఇవ్వటం జరిగింది. పెండింగ్లో ఉన్న రెండు నెలలు వేతనాలు, 60 సంవత్సరాలు కార్మికుల్ని కుటుంబ సభ్యులు తీసుకోవాలని విధుల్లో తీసుకోవాలని, జీవో నెంబర్ సెవెన్ ప్రకారం వేసనాల పెంచాలని, అసిస్టెంట్ కమిషనర్ని కోరారు, ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ డి. కొండయ్య మాట్లాడుతూ పది రోజుల్లో వేతనాలు విడుదల చేస్తామని చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో కే గోపి, భారతి, మరియమ్మ, కమల ,కే వంశీ, జేమ్స్, కే పద్మ, తదితరులు పాల్గొన్నారు.




# నేడు డయల్ యువర్ డిఎం డిపో మేనేజర్ వి శంకర్రావు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 16)

ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రధాన కార్యాలయం, విజయవాడ వారి ఉత్తర్వుల అనుసరించి ప్రతి నెల జరుపుతున్నట్లుగా ఈ నెల 17వ తేదీ గురువారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జరుపబడుతుందని పొదిలి డిపో మేనేజర్ వి శంకర్రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, ప్రయాణికులు వినియోగించుకొని పొదిలి డిపో అభివృద్ధికి తమ విలువైన సలహాలు, సూచనలను డిపో మేనేజర్ వారి మొబైల్ నెంబర్ 9959225700నకు ఫోన్ చేసి డయల్ యువర్ డిఎం కార్యక్రమం ద్వారా తెలపాలని ప్రజలను కోరారు. యావన్మంది ప్రజలు, ప్రయాణికులు పొదిలి డిపో బస్సులు తిరుగు ప్రదేశముల వారు పొదిలి డిపో బస్సులలో వారి వారి గమ్య స్థానాలకు ప్రయాణించేవారు వారి యొక్క అమూల్యమైన సలహాలు, సూచనలు తెలుపుచూ ఈ కార్యక్రమం ఉపయోగించుకోవాలని తెలిపారు. పత్రికా విలేకరులు కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు. మీరు ఇచ్చే సలహాలు, సూచనలు మాకెంతో విలువైనవి, సాధ్యమైన వాటిని అమలు చేసేందుకు తప్పనిసరిగా ప్రయత్నం చేయాలని కోరారు.

# చినుకు పడితే అంతే సంగతులు

(షణ్ముఖ వెలుగు, కొండపి, ఏప్రిల్ 16)

పేరుకు మాత్రం కొండేపి గ్రామపంచాయతీ పెద్ద పంచాయతీ జెండా చెట్టు సెంటర్లోని ఇళ్ల మధ్యన ప్రధాన రహదారిలో సైడ్ కాలువ లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. అటు వైపు వెళ్లాలంటే మురికి నీళ్లలో దిగి వెళ్లాల్సిందే. స్వచ్ఛభారత్ స్వచ్ఛ దినస్ కొండపిలో మాత్రం కనుచూపు మీద కూడా రావటం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి కొండపిలోని సైడ్ కాలువలు, పూడికలు తీసివేసి రోడ్డుపై వర్షపు నీరు మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని కొండపి గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# నిందితులను పట్టుకోవడంలో పోలీసు జాగిలాలు కీలకం

### కేసుల ఛేదనలో పోలీసులతో ధీటుగా జాగిలాలు కూడా సిద్ధం
### జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్‌ను పరిశీలించిన
### ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

నేరాలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం పోలీసు జాగిలాలు కీలకంగా నిలుస్తున్నాయని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గల డాగ్ స్క్వాడ్ యూనిట్‌ను జిల్లా ఎస్పీ సందర్శించి, డాగ్ స్క్వాడ్ యూనిట్ పరిసరాలను, అక్కడ ఉన్న వివిధ జాగిలాలను, వాటి గదులను, అందించే ఆహారాన్ని, వాటికి ఉపయోగించే వివిధ రకాల పరికరాలను పరిశీలించారు. జాగిలాలకు సంబంధించిన పలు విషయాలు గురించి డాగ్ హ్యాండ్లర్స్ ఎస్పీ గారికి వివరించారు. జాగిలాల ఆరోగ్య పరిస్థితిని, వాటికి అందించే ఆహార గురించి అడిగి తెలుసుకుని వాటి యొక్క శ్రద్ధ, ప్రతిస్పందనను పరిశీలించారు. ప్రేలుడు పదార్థాలను పసిగట్టే నాలుగు జాగిలాలు, క్రైమ్ ట్రాకర్స్ రెండు జాగిలాలు యొక్క పనితీరును ఎస్పీ స్వయంగా పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా డాగ్ స్క్వాడ్‌లోని జాగిలాలకు వాతావరణం అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు సిబ్బందికి సూచించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా జాగిలాలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ గారు ఐదు కొత్త కూలర్లను అందజేశారు. మెరుగైన నేరవిచారణకు దోహదపడే విధంగా జాగిలాలకు శిక్షణ ఇవ్వాలని, కొత్త మెళుకువలను నేర్పించాలని, సమయానికి ఫీడింగ్ అందించాలని, వాటి ఆరోగ్యం పట్ల తగిన



జాగ్రత్తలు తీసుకోవాలని డాగ్ స్క్వాడ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో డాగ్ స్క్వాడ్ ఒక ముఖ్యమైన విభాగమని, నేరాల దర్యాప్తులో మరియు శాంతిభద్రతల పరిరక్షణలో శిక్షణ పొందిన జాగిలాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దొంగతనాలు, పేలుడు పదార్థాల గుర్తింపు, ప్రమాదకర ప్రాంతాలకు చేరుకోవడం, వీఐపీ ల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ జాగిలాలు అత్యంత ముఖ్యమన్నారు. నేరాలు జరిగినప్పుడు ఘటనా స్థలంలో పోలీసు జాగిలాలు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి నిందితులను వాసన ద్వారా పసిగడతాయని, ముఖ్యంగా స్నిఫర్ డాగ్ (వాసన చూసి పసిగట్టడం)తనిఖీ సమయంలో పేలుడు పదార్థాలు, భద్రతా తనిఖీల అంశాలను కనుగొనడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నేర పరిశోధనలో నేరస్తులను అదుపులోకి తీసుకోవడంలో పోలీస్ జాగిలాల పనితీరు అమోఘమైనదని, అలాంటి పోలీస్ జాగిలాలకు నిరంతరం శిక్షణ అందిస్తూ, ఉత్సాహవంతమైన విధి నిర్వహణకు సిద్ధంగా



ఉంచాలని డాగ్ స్క్వాడ్ హ్యాండ్లర్స్ ను ఆదేశించారు. ఎస్పీ సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణ రెడ్డి , సిబ్బంది ఉన్నారు.

# పెద్ద గొల్లపల్లి సచివాలయం తనిఖీ



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 16)

మండలంలోని పెద్ద గొల్లపల్లి సచివాలయంను మండల పరిషత్ అభివృద్ధి అధికారి, రంగ సుబ్బరాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, సర్వేల వివరాల పై సమీక్షించారు. సమయపాలన పాటించాలని సూచించారు.

# బీద రవిచంద్ర ప్రమాణస్వీకారం కార్యక్రమంలో చేజర్ల





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 16)

బుధవారం ఉదయం వెలగపూడిలోని శాసనమండలిలో శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు, తన ఛాంబర్ ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్రతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వరరెడ్డి రవిచంద్రకు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు.

# రాచర్ల ఎస్ఐకి తప్పిన ప్రమాదం




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 16)

రాచర్ల మండల ఎస్ఐ కోటేశ్వరరావుకు రోడ్డు ప్రమాదం నుంచి ప్రాణాపాయం తప్పింది. బుధవారం రాచర్ల నుండి మార్కాపురంకు క్రైమ్ మీటింగ్‌కు వెళ్లిన రాచర్ల ఎస్సై కోటేశ్వరవు తిరిగి పోలీస్ జీప్‌లో రాచర్లకు వస్తుండగా మార్కాపురం మండలం చింతకుంట గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై మినీ లారీ జీపును ఢీకొట్టింది. ఈ ఘటనలో రాచర్ల ఎస్సైకి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవరు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన





(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 16)

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అర్బన్ కాలనీలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆందోళన పడకుండా ఆలోచనతో అగ్ని ప్రమాదాలను అరికట్టే నైపుణ్యాలను ప్రయోగాత్మకంగా వివరించారు. గ్యాస్ సిలిండర్ వాడుకలో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి 6 నెలలకు ఒకసారి గ్యాస్ కనెక్షన్ పైప్ సరిచూసుకుని మార్చాలని, పొరపాటున ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి డి.పి చౌదరి,సిబ్బంది పాల్గొన్నారు.

## హైస్కూల్ విద్యార్థులకు డెంటల్ మెడికల్ క్యాంపు

### మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్, డెంటిస్ట్ డాక్టర్ అప్సానా బేగం






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 16) మండల కేంద్రమైన ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు బుధవారం డెంటల్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు దంత సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. దంతాల యొక్క పరిశుభ్రత, బ్రష్ చేసుకునే



విధానం గురించి విద్యార్థులలో అవగాహన కల్పించారు. ఉలవపాడు ప్రభుత్వ ఆసుపత్రి నందు పనిచేయుచున్న డెంటిస్ట్ అప్సానా బేగం ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటుగా వారందరినీ పరీక్షించి తగు సూచనలు చేశారు. అదేవిధంగా ట్రీట్మెంట్ అవసరమైన విద్యార్థులకు ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఓగిరాల ఆదిశేషయ్య, హిందీ ఉపాధ్యాయులు సుధాకర్ , సైన్స్ ఉపాధ్యాయులు ఫణి రాజు, అరుణ , ఉమామహేశ్వరి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పేస్టు , బ్రష్లు పంపిణీ చేశారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)
అగ్నిమాపక వారోత్సవాలు- 2025 కార్యక్రమంలో భాగముగా ఈ నెల 16వ తేదీన ఒంగోలు నగరంలోని సమతనగర్- 3 వ అడ్డ రోడ్ లో గల నివాస గృహముల సముదాయం నందు ఉన్న ప్రజలకు నివాసగృహముల యందు జరుగు వంటగ్యాస్ ఫైర్స్, ఆయిల్ ఫైర్స్, ఎలక్ట్రికల్ ఫైర్స్ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ విధంగా నివారించాలో మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అక్కడికి వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన తెలియపరిచే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి కె శ్రీకాంత్‌రెడ్డి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు ఎంఈఓ రమణయ్య

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 16)
ఏపీ ప్రైవేట్ (అన్-ఎయిడెడ్) పాఠశాలల్లో ఆర్టీఈ యాక్ట్-2009 ప్రకారం పేద విద్యార్ధులకు 2025-26 విద్యా సం. 1వ తరగతిలో 25% ఉచిత సీట్లు లాటరీ పద్ధతిలో కేటాయించుటకు షెడ్యూల్, మార్గదర్శకాలతో కూడిన నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేసింది పాఠశాల విద్యాశాఖ. అనాథ పిల్లలు, హెచ్ఐవి బాధితుల పిల్లలు, దివ్యాంగులు - 5%, ఎస్సీలకు - 10%, ఎస్టీలకు - 4% , బలహీన వర్గాలకు (బీసీ, మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు 6% సీట్లుగా పేర్కొన్నారు. ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 19 నుంచి ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడుతుందని తెలిపారు.

# రాహుల్‌ని చూసి భయపడుతున్న మోడీ

### అందుకే అక్రమ సిబిఐ, ఈడి కేసులు ఒంగోలు బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)
ఒంగోలు నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను ఖండిస్తూ, ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ పతాకాలు, ప్లే కార్డులు, నల్ల జండాలతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ, "నేషనల్ హెరాల్డ్ కేసును రాజకీయం చేసి, సోనియా గాంధీ , మరియు రాహుల్ గాంధీ పై అసత్య ఆరోపణలతో చార్జ్‌షీట్ దాఖలు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి, రాజకీయ దురుద్దేశానికి నిదర్శనమని" ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో పాత్ర పోషించిన నేషనల్ హెరాల్డ్ పత్రికను తిరిగి నిలబెట్టేందుకు, అప్పుల్లో ఉన్న అసోసియేటెడ్‌జర్నల్ లిమిటెడ్‌కు 2002 నుండి 2011 మధ్య కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.90 కోట్ల సహాయాన్ని నేడు బలహీనమైన ఆరోపణలుగా చూపడమేంటని?ఆయన ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎలాంటి అక్రమ లాభాలూ లేవు. యంగ్ ఇండియా అనే సంస్థ లాభాపేక్ష లేని సంస్థగా నమోదు చేయబడి, అందులో ఎవరికీ జీతాలు, డివిడెండ్లు రావు. ఏజెఎల్‌కు ఉన్న ఆస్తులన్నీ అదే సంస్థకు చెందుతాయి. రాహుల్ గాంధీ , సోనియా గాంధీ , ఒక్క రూపాయి లాభం పొందలేదు. ఇది ముమ్మాటికీ ఒక రాజకీయ ప్రతీకారం మాత్రమే,అని సైదా స్పష్టం చేశారు. మీ వద్ద పక్కా ఆధారాలుంటే గత 11 ఏళ్లుగా ఎందుకు నిరూపించలేకపోయారు? ఇ డీకి 365 రోజుల్లోగా చార్జ్‌షీట్ వేయాల్సి ఉండడంతో చివరి రోజున పెట్టింది, ఇది బీజేపీ ప్రభుత్వ మానసిక దౌర్భాల్యానికి నిదర్శమణి ఆయన విమర్శించారు. ఈ దేశంలో స్వాతంత్ర్యం కోసం పోరాడినవాళ్ల వారసులు సోనియా, రాహుల్ గాంధీలు. బెదిరించాలనే ప్రయత్నం చేస్తే మీకు ఈ దేశ ప్రజలు మిమ్మల్ని ఈ దేశానికి సాగనంపుతారు, బ్రిటిష్ వాళ్ళనే కాంగ్రెస్ పార్టీ ఈ దేశం నుంచి తరిమేసింది మీరు ఒక లెక్క అని ఆయన ప్రశ్నించారు, మీ యొక్క బెదిరింపులు మీ యొక్క కుయుక్తులు ఈ దేశంలో సాధ్యపడవని, మోదీకి స్పష్టం చేయాలన్నారు. మేము మీ ద్వేష రాజకీయం, ఆర్థిక వైఫల్యం, మూలధనవాదంతో కలిసిపోయిన పాలనను దేశం ముందు నిలబెట్టుతూనే ఉంటాం. మేము మైనారిటీల, దళితుల, గిరిజనుల, పీడిత, తాడిత వర్గాల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని షేక్ సైదా ఘాటుగా అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షురాలు టీ. నాగలక్ష్మి, కేకేసీ రాష్ట్ర చైర్మన్ , దర్శి నియోజకవర్గ కోఆర్డినేటర్ కైపు వెంకట కృష్ణ రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ కోఆర్డినేటర్ బీఆర్ గౌస్, కొండేపి కోఆర్డినేటర్ శ్రీపతి సతీష్, సంతనూతలపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ పాలపర్తి విజేష్ రాజ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ మన్నం ప్రసన్న రాజు, జిల్లా బీసీ సెల్ చైర్మన్ నట్టే సుబ్బారావు, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ సుదర్శి రవి, సోషల్ మీడియా అధ్యక్షుడు తాడేపల్లి సుధీర్ వర్మ, జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రసూల్, బొడ్డూ సతీష్, కాకర్ల వేణు, గోరంట్ల కోటేశ్వరరావు, కొణిజేటి గురుబాబు, రమేష్ తదితరులు , సతీష్ తదితర కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు.







## అల్లినగరం హైస్కూల్లో ఘనంగా వీరేశలింగం పంతులు జయంతి

(షణ్ముఖ వెలుగు, కొమరోలు, ఏప్రిల్ 16)
కొమరోలు మండలంలోని అల్లినగరం శ్రీ మునుమనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి అధ్యక్షతన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి మాట్లాడుతూ వీరేశలింగం పంతులు సమాజంలోని మూఢనమ్మకాలను మూఢాచారాలను వ్యతిరేకించి నిరంతరం పోరాడిన ధీరుడు, బాల్యవివాహాలను వ్యతిరేకించి వాటి నిర్మూలనకు కృషిచేసిన మహనీయుడని, వితంతు వివాహాలను ప్రోత్సహించి వాటిని కొనసాగించుటకు ఎంతగానో కృషి చేశారని ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు కొత్తపల్లి సుజాత మాట్లాడుతూ వీరేశలింగం పంతులు వితంతు శరణాల యాలను స్థాపించారని సంఘసేవ దైవ సేవగా భావించి ప్రజలకు సేవలు అందించాలని కన్యాశుల్కం వరకట్నం మహా పాపమని వాటిని వ్యతిరేకించి వాటి నిర్మూలనకు ఎంతో కృషి చేసిన మహనీయుడని, మనమందరం వారి ఆశయాలను కొనసాగించాలని సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటనారాయణ కోటేశ్వరరావు, సుజాత, ప్రకాషరావు, చంద్రమోహన్, శివరాం గురువయ్య, సిబ్బంది అశ్వినిదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.






## బాలికల వసతి గృహాన్ని మరోచోట నిర్మించాలి

### వినతి పత్రాలు అందజేత

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 16)
పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో బాలికల వసతి గృహాన్ని నిర్మించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ విషయంపై ఇటు విద్యార్థులకు అటు ప్రజలకు ఇబ్బంది కలగకుండా పునరాలోచన చేసి ఆ వసతి గృహాన్ని మరొకచోట నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ సభ్యులు కోరారు. బుధవారం ప్రెస్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ మండల స్థాయి అధికారులను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని ప్రెస్ క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధిని స్వాగతిస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు ఉదయం సాయంత్రం వాకింగ్ ట్రాక్ గా క్రీడా ప్రాంగణాన్ని ఉపయోగించుకుంటున్నారని తెలిపారు.విద్యార్థులు శారీరిక దారుఢ్యం, ఉల్లాసానికి , మానసిక ప్రశాంతతను పెంచుకోవడానికి, క్రీడలు ఆడుకోవడానికి ఈ ప్రాంగణం ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. కాబట్టి అధికారులు ఈ విషయం మీద తగిన శ్రద్ధ వహించి విద్యార్థులకు, పట్టణ ప్రజలకు, చదువుకుంటున్న బాలికలకు ఇబ్బంది కలగకుండా మంచి వాతావరణంలో బాలికల వసతి గృహాన్ని నిర్మించాలని ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

### ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పోలీస్ సంక్షేమ విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేసిన ఎస్పీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)
పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పలు విభాగాలను బుధవారం జిల్లా ఎస్పీ పరిశీలించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న పోలీసు క్యాంటీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని క్యాంటీన్‌లో ఎలాంటి టిఫిన్, టీ, కూల్ డ్రింక్స్ తినుబండారాలు, స్నాక్స్ విక్రయిస్తున్నారు, తదితర అన్ని విషయాలపై ఆరా తీశారు. క్యాంటీన్ లో నాణ్యమైన టిఫిన్ మరియు తినుబండారాలు అందించాలని, పలు రకాల ఐటమ్స్ ఉండేలా చూసుకోవాలని, క్యాంటిన్ లో వస్తువులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లోపలి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని, ఎవరికి అసౌకర్యం కల్పించకుండా అందరితో మర్యాదగా మాట్లాడాలని, క్యాంటీన్ నిర్ణీత సమయాలల్లో ఓపెన్ చేస్తూ సక్రమంగా నడపాలని పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ జిమ్ ను సందర్శించి వివిధ రకాల వ్యాయామ పరికరాలను పరిశీలించి, వాటి పనితీరు, నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిమ్‌ను మరింత మెరుగుపరచడానికి, అవసరమైన కొత్త పరికరాలను సమకూర్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే, బ్యారక్‌లలో పరిశుభ్రతను మరింత మెరుగుపరచడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.









# వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

## జాయింట్ కలెక్టర్ కె కార్తీక్






**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 16)**

వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వ్యవసాయంలో కిసాన్ డ్రోన్ల వినియోగం-ఉపయోగాలపై జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ అన్నదాతలకు వ్యయ ప్రయాసలు లేకుండా తక్కువ ఖర్చుతో మెరుగైన ఆదాయం పొందేందుకు అనేక నూతన శాస్త్ర, సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వస్తున్నట్లు చెప్పారు. అందులో భాగమే ఈ కిసాన్ డ్రోన్ల వినియోగం అని జేసీ అన్నారు. ఈ డ్రోన్లను వినియోగించి పురుగుల మందులను పిచికారీ చేయడం వలన శ్రమ, ఖర్చు రెండూ తగ్గుతాయని, రైతుకు అన్నివిధాల ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఒక్కొక్క డ్రోన్ ఖరీదు 10 లక్షలు కాగా 80శాతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ అందిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకులు రుణ సదుపాయం కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఎంపిక చేసిన కంపెనీల ప్రతినిధులు డ్రోన్లను రైతులకు అందించి, డ్రోన్ వినియోగంపై శిక్షణ కూడా ఇస్తారన్నారు. రైతులందరూ ఐదుగురు చొప్పున గ్రూపుగా ఏర్పడి ఈ డ్రోన్‌ను పొంది వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులతో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 41 రైతు సంఘాలకు ఈ డ్రోన్లు అందించేందుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వరిసాగు, ఉద్యానపంటల సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ డ్రోన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రూపులోని ఐదుగురిలో మంచి నైపుణ్యం, విద్యార్హత గల వ్యక్తిని డ్రోన్ పైలెట్‌గా ఎంపిక చేసి డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 11 గ్రూపులకు సంబంధించి ఆపరేటర్లకు డ్రోన్ పైలట్ శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. ఒక్కొక్క గ్రూపులో ఇద్దరిని కన్వీనర్, కోకన్వీనర్‌గా నియమించి బ్యాంకు ఖాతాలు ప్రారంభించి రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని రైతులందరూ ఈ డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. తొలుత డ్రోన్ కంపెనీల ప్రతినిధులు ప్రత్యక్షంగా డ్రోన్లను చూపించి,వాటి పనితీరు, బ్యాటరీల చార్జింగ్, సాంకేతిక పరిజ్ఞానం మొదలైన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, వ్యవసాయశాఖ ఎడిలు శేషగిరి, నర్సోజిరావు, టెక్నికల్ ఎవో మంజుల, డ్రోన్ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## నెల్లూరు మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ బదిలీ



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 16)**

రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం బదిలీ చేసింది. ఇందులో భాగంగా నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సూర్యతేజను కూడా ఈ బదిలీ జాబితాలో ఉన్నారు. ఆయన మున్సిపల్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. అంతేగాక నిద్ర లేవడంతోటే ప్రతి వార్డు తిరుగుతూ కార్పొరేషన్ లోని వివిధ సమస్యలను పరిష్కరించే రీతిలో ఆయన కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన బదిలీ పట్ల పరువు రూ కార్పొరేటర్లు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

### వైసీపీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మీర్జా షంషీర్ అలీ బేగ్




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 16)**

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వైసీపీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మీర్జా షంషీర్ అలీ బేగ్ డిమాండ్ చేశారు. మార్కాపురంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. దేశంలో ముస్లిం మైనార్టీలను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఇందులో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చిందన్నారు. బిల్లును రద్దు చేయకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## ప్రతి రైతు భూకమతాల్ని తనిఖీ చేయించుకోవాలి

### డిప్యూటీ తహసీల్దార్ కె కిషోర్‌రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 16)**

ఈ నెల 16వ తేదీన రసీదుపురం గ్రామంలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. మండలంలో మొత్తం 27 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటికీ 8 గ్రామాలు పూర్తయ్యాయి. తొలి విడతగా వీరరామపురం గ్రామం నిర్వహిస్తుండగా రెండో విడతగా మండలంలో రసీదుపురం గ్రామాన్ని గుర్తించారు. దీనిపై బుధవారం డిప్యూటీ తహసిల్దార్ కె కిషోర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి రైతు రీ సర్వేకు హాజరై భూకమతాల్ని తనిఖీ చేయించుకోవాల్సిందిగా తెలిపారు. అలాగే ఆన్లైన్ లేని వారు ఇతరుల ఖాతాలు, తల్లిదండ్రులు మరణించిన వాళ్లు, కొనుగోలు ద్వారా సంక్రమించిన వారు అందరూ గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి ఆన్లైన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులకు రీ సర్వే విషయం తెలియపరిచి రీసర్వేకు హాజరు కావలసిందిగా కోరారు. రైతులందరూ తప్పనిసరిగా హాజరై సర్వే రికార్డును, రెవెన్యూ రికార్డులను రూపొందించుటకు సహకారం అందించాలని కోరారు. రసీదుపురం గ్రామంలో మొత్తము విస్తీర్ణం 1288. 66 సెంట్లు కలదు పట్టా భూమి 316.78 ప్రభుత్వ భూమి 548 . 75 సెంట్లు గా కలదు మొత్తం ఖాతాలు 380 మొత్తం సర్వే నెంబర్లు 141 ముందుగా గ్రామ సరిహద్దులు , ప్రభుత్వ భూముల సరిహద్దులు నిర్ణయించి ఎఫ్ పి ఓ ఎల్ ఆర్ పూర్తి చేసి ఆ తదుపరి పట్టా భూములు సర్వే చేస్తామని గ్రామ సభ సభ ముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య ,రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణ చైతన్య, గ్రామ రెవెన్యూ అధికారి గురుస్వామీ, గ్రామ సర్వేయర్లు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డాక్టర్లు మెరుగైన సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న డాక్టర్లు మెరుగైన సేవలు అందిస్తూ వాటికి ఐకాన్‌గా నిలవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. వైద్యశాఖ పై బుధవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంతో పోల్చితే ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. అయితే దీనిని మరింతగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందని, ప్రైవేటు ఆసుపత్రులతో పోటీపడి పని చేయాలని వైద్యులను ఆదేశించారు. ఈ దిశగా తమ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందితో ప్రతివారం సమీక్షిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, హైరిస్క్ కేసులు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయటం, తద్వారా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం నుంచి వచ్చే ఆర్థిక ప్రయోజనాన్ని పొందటం, బరువు తక్కువ పిల్లల జననం, ఇలాంటి పిల్లల ఆరోగ్య పరిస్థితిని బాలింతల ఇళ్లకు వెళ్లి పారామెడికల్ సిబ్బంది నిరంతరం గమనించడం, మాతా - శిశు మరణాలు, వ్యాక్సినేషన్, దోమల వలన కలిగే వ్యాధులు, వేసవి దృష్ట్యా వచ్చే మూడు నెలల పాటు వడగాలుల వలన ప్రాణ నష్టం జరగకుండా చూసేలా కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని మరింత మెరుగు పర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తక్షణమే యాప్ లో నమోదు చేయడంలో కుదరకపోయినా వ్యాక్సి నేషన్ వంటి ఫిజికల్ గా చేయాల్సిన పని తక్షణమే చేయాలని కలెక్టర్ చెప్పారు. గొప్ప సంకల్పంతో ప్రవేశపెట్టిన పథకాలను అదే స్ఫూర్తితో అమలు చేస్తేనే ఫలితాలు వస్తాయని అన్నారు. ఈ దిశగా మెడికల్ ఆఫీసర్లు దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీ.ఎం.హెచ్.వో. వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీ.ఎం.హెచ్.వో.లు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్, డీ.ఐ.వో పద్మజ, మండల మెడికల్ ఆఫీసర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న విజయ దశమి నాటకం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)**

తెలుగు నాటక రంగ దినోత్సవం అనగా కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా శ్రీ కళా ప్రకాశం ఒంగోలు వారు ప్రదర్శించిన "విజయదశమి" పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. భారతంలో ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని ఇతివృతంగా ఉన్న ఈ నాటక రచనను స్వర్గీయ చిలమకూరి వెంకట కృష్ణమూర్తి చేయగా దర్శకత్వంను శ్రీ చిట్టా వెంకట శివప్రసాద్ నిర్వహించారు. ఇందులో నటీనటులు అర్జునుడిగా బాచిన సుబ్బయ్య, దుర్యోధనుడిగా జి. వెంకట్రామయ్య, బృహన్నలగా (రిమ్స్) బాబురావు భీష్ముడుగా బ్రహ్మయ్య, ద్రోణుడిగా పిచ్చయ్య పంతులు, అశ్వద్ధామగా పి . శ్రీనివాసులు రెడ్డి , కర్ణుడిగా ఎం జయరాం, సుశర్మగా బాల గురవయ్య, దుశ్శాసనుడిగా ధేనువకొండ సుబ్బయ్య , ఉత్తరుడుగా శ్రీ జి సుబ్బారావు , నిరుత్తరుడుగా అంగలకుర్తి ప్రసాద్, ఉత్తరగా తమ నటనతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. ఈ కార్యక్రమానికి సంగీతం హార్మోనియం షేక్ సుభాని, కీబోర్డ్ ఎస్కే బాబు, తబలా కే శ్రీనివాసులు అందించారు.

## భర్త మృతితో అనాథగా మారిన కుటుంబానికి అండగా ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం

### తక్షణ సాయం కింద రూ.25 వేల ఆర్థిక సహాయం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)**

ఒంగోలు మండలం గుడిమెళ్ళపాడు గ్రామానికి చెందిన పొడపాటి వెంకటకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వెంకటకృష్ణమృతితో ఆకుటుంబం అనాథగా మారింది. వారికి ఇద్దరు చిన్నపిల్లలు. భర్త మృతితో మానసికంగా ఆర్థికంగా కృంగిపోతున్న వెంకటకృష్ణ భార్యను వారి పిల్లల్ని చూసిన ప్రకాశం జిల్లా కమ్మవారి సేవాసంఘం అండగా నిలబడింది. కనీసం ఇల్లు కూడా లేని వారి ఆర్థిక స్థితిపై మానవతా దృక్పథంతో స్పందించింది. వారికి కమ్మవారి సేవా సంఘం తరపున తక్షణ సాయం కింద 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు మండలం మురళీకృష్ణ మాట్లాడుతూ ఏ ఆధారం లేని పొడపాటి వెంకటకృష్ణ కుటుంబానికి అండగా కమ్మవారి సేవాసంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దీనితోపాటు చిన్న పిల్లల విద్యకు పూర్తి బాధ్యత వహిస్తామని పేర్కొన్నారు. నిలువ నీడ కూడా లేని వారి కుటుంబానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావుతో మాట్లాడి గృహ నిర్మాణానికి సహకరిస్తామని పేర్కొన్నారు. నిరుపేదలైన ఎంతోమంది అభాగ్యులకు అన్నార్తులకు కమ్మవారి సేవా సంఘం అండగా నిలుస్తుందని, ఇప్పటికీ ఎంతోమందికి ఆర్థికంగా సహాయం చేసి వారిని ఆదుకోవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మవారి సేవా సంఘం కార్యదర్శి ఆలా హనుమంతరావు, డోనర్స్ క్లబ్ ఛైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## స్టేట్ ఫస్ట్ విద్యార్థిని అభినందించిన మంత్రి నారా లోకేశ్




**(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 16)**

కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్య ఇంటర్మీడియట్ హెచ్ఈసీలో వెయ్యికి 980 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు కైవసం చేసుకుంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చేతుల మీదుగా తమ్మినేని చాతుర్య 'షైనింగ్ స్టార్ 2025' అవార్డు అందుకున్నారు. ఐఏఎస్ సాధించాలనేది తన లక్ష్యమని చాతుర్య అన్నారు.

## పొదిలి నూతన నగర కమిషనర్ నారాయణరెడ్డి త్వరలో పదవి బాధ్యతలు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 16)**



పొదిలి నగర పంచాయితీకి నూతన కమీషనర్ త్వరలో రానున్నారు. కర్నూలు మున్సిపల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణరెడ్డిని (ఎఫ్ఏఏసి) గా నగర పంచాయితీ కమీషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పొదిలి కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పులి శ్రీనివాసరావు గతంలో నరసరావుపేట మున్సిపల్ మేనేజర్‌గా మరల అక్కడకు వెళ్ళనున్నట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ పరిపాలనలో భాగంగా బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది.

# జాయింట్ కలెక్టర్ సమక్షంలో కృత్రిమంగా పండ్లు మరగబెట్టడంపై అధికారులతో సమావేశం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 16)

బుధవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జూమ్ మీటింగ్‌లో పండ్లు కృత్రిమముగా మగ్గబెట్టుటలో కాల్షియమ్ కార్బైడ్ ను నిరోధించడం గురించి జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్, మార్కెటింగ్ డిపార్ట్మెంట్, మునిసిపల్ డిపార్ట్మెంట్, మెడికల్ , హెల్త్ డిపార్ట్మెంట్, పంచాయతి డిపార్ట్మెంట్, హార్టికల్చర్ డిపార్ట్మెంట్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్‌లు పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ వేసవి కాలంలో మామిడి పండ్ల సీజన్ మొదలవుతున్న కారణంగా మానవులకు హాని కలిగించే కాల్షియమ్ కార్బైడ్ ను ఉపయోగించి మామిడి పండ్లు మగ్గబెట్టే ప్రక్రియను నిరోధించడం గురించి పైన తెలిపిన అధికారులతో చర్చించి క్రింది సూచనలు ఇచ్చారు.

**మామిడి పండ్లు పండించే రైతులకు అవగాహన కల్పించడం**

మామిడి పండ్లు వ్యాపారం చేసే వ్యాపారస్తులకు తగు చర్యలు తీసుకోవడం గురించి తెలుపడం, ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ వారిని ఈ కాల్షియమ్ కార్బైడ్ వాడకం నిరోధించడానికి విరివిగా శాంపిళ్లు సేకరించి, అనంతరం సంబంధిత వ్యాపారస్తులు, రైతులు , అమ్మకందారులు తిరిగి కార్బైడ్ వాడకుండా తగిన సూచనలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేనిచో అట్లు పాటించని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పంచాయత్ అధికారి, మునిసిపల్ సిబ్బందిని జిల్లాలో చిన్న చిన్న దుకాణదారులకు కార్బైడ్ వాడకం వల్ల వచ్చే అనర్థాలు తెలియచేయమని అదే విధంగా ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ వారు మామిడి పండ్ల రవాణా వాహనాలను తనిఖీ చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రింది పద్ధతులను ఉపయోగించి మామిడి పండ్లను మగ్గబెట్టడం ద్వారా ఆరోగ్య కరమైన పండ్లు వినియోగించవచ్చు. సహజ సిద్ధంగా మామిడిపండ్లు మగ్గబెట్టాలి, అందుకు వరిగడ్డి, కార్డ్బోర్డ్ బాక్స్ , పేపర్ బాగ్స్ ఉపయోగించాలి. నాచురల్ గా సహజ హార్మోన్ ఎతిలీన్ గ్యాస్ స్ప్రే చేయడం ద్వారా మామిడి పండ్లను మగ్గబెట్టవచ్చు. రిపెనింగ్ ఛాంబర్ ల ద్వారా ఎతిలీన్ హార్మోన్ ఉపయోగించి మగ్గబెట్టడం, శీతల



గిడ్డంగుల్లో కూడా ఎతిలీన్ హార్మోన్ ఉపయోగించి మామిడి పండ్లు మగ్గబెట్టవచ్చు అని తెలిపారు. రయిపెనింగ్ ఛాంబర్లను రైతులు , వ్యాపారస్తులు వినియోగించుకోవచ్చునని తెలిపారు. నిషేధించబడిన రసాయనాలు వాడటం వల్ల మానవులకు హానికరం, తలతిరగడం, వాంతులు, బలహీనత, కాన్సర్ వంటివి వచ్చే అవకాశాలు ఉన్నందున ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ వారిచే అనుమతించబడినను ఎథిలిన్ చాంబర్స్ , కంప్రెస్డ్ ఎథిలిన్ గ్యాస్ , ఎథెఫాన్ మొదలుగునవి మాత్రమే పండ్లను కృత్రిమంగా పండించుటకు ఉపయోగించాలన్నారు. అదేవిధముగా అనుమతి లేని కాల్షియం కార్బైడ్ ఉపయోగించి పండ్లను పండించిన ,ఎథెఫాన్ సాచెట్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించిన యడల క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తోందని వ్యాపారులను హెచ్చరించారు. అదే విధముగా ప్రతి వ్యాపారస్తుడు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ పొంది వ్యాపారము నిర్వహించుకొనవలసినదిగాను లేని యడల 10 లక్షల రూపాయల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. అదేవిధంగా ఫుడ్ సేఫ్టీ శాఖ వారిని జిల్లాలోని రైతు బజార్లు ,మార్కెట్ల నందు పండ్ల విక్రయించుచున్న రిటైల్, హోల్సేల్ దుకాణముల నందు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.



# శాఖల సమన్వయంతోనే గిరిజనులకు ప్రయోజనాలు

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు గిరిజనులకు పూర్తి స్థాయిలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. పీ.ఎం. జన్ మన్, డీ.ఏ. జె.జీ.యూ.ఏ. పథకాల అమలులో పురోగతి, క్షేత్రస్థాయిలో సమస్యలు తదితర అంశాలపై బుధవారం ప్రకాశం భవనములో ఆమె సమీక్షించారు. ఆయా పథకాల కింద జిల్లాలోని గిరిజన ప్రాంత మండలాల్లో హౌసింగ్, రోడ్డు సదుపాయం, తాగునీరు, విద్యుత్ సదుపాయం, బహుళ ప్రయోజనాల కేంద్రాల నిర్మాణం, వందన్ వికాస్ కేంద్రాల ఏర్పాటు, మొబైల్ కనెక్టివిటీ, అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు - ఆధునీకరణ, వంట గ్యాస్ సదుపాయం, నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. వీటి పురోగతిని ఐటిడిఏ పిఓ శివప్రసాద్ ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఆగష్టు 15 నాటికి గృహ ప్రవేశం చేసేలా ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర సదుపాయాల కల్పనలోనూ పురోగతి కనిపించాలని చెప్పారు. మొబైల్ టవర్స్, ఇతర నిర్మాణాలకు



అవసరమైన భూమి త్వరగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు కూడా అప్పటికప్పుడే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, ఏపీసీపీడీసీఎల్, వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ఈ బాల శంకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి బేబీ రాణి, జిల్లా పౌరసరకాల సంస్థ మేనేజర్ వరలక్ష్మి, డీఎస్‌వో పద్మశ్రీ, ఐసీడీఎస్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

### నిబంధనలకు విరుద్ధంగా ప్రజారవాణా చేసే వాహనదారులపై చట్టపరమైన చర్యలు

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 16)



జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి శ్రీరామ్, వారి సిబ్బంది కలిసి కనిగిరి-పొదిలి హైవే రోడ్డులోని పొగాకు బోర్డు దగ్గర వాహనాల తనిఖీ చేస్తుండగా, పొదిలి వైపు నుండి కనిగిరి టౌన్‌కి ఏపీ 39 టీకే 3414, ఏపీ 39 యుజే6934 నంబర్లు గల ఆటో డ్రైవర్ లు తమ వాహనములను అతివేగంగా, నిర్లక్షంగా నడుపుతూ ఆటోలో పరిమితికి మించి ఎక్కువగా ప్రయాణికులను రెండు వైపుల ఎక్కించుకొని, ఆటోలో వెనుక వైపు నిలబడి ప్రయాణిస్తున్న, ఆటో డ్రైవర్లకు ఎటువంటి లైసెన్స్, ఇన్సురెన్స్ లేకుండా ఆటోను వేగంగా, నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడుపుతూ మానవ ప్రాణాలకు, ఇతర వ్యక్తి గత భద్రతకు ప్రమాదం జరిగే విధంగా ఆటో నడుపుచుండగా, కనిగిరి ఎస్పై సదరు ఆటో డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకొని ఆటో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ముద్దాయిలు బద్దిక శివ సన్‌ఆఫ్ శ్రీను, జిలకర దేవదాసులు గా గుర్తించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నా, కూలీలను ఎక్కించిన, ఆటోలో ముందు, వెనుక ప్రయాణికులు ఎక్కించుకున్న లేదా సరుకు రవాణా వెహికల్స్‌లలో పెళ్ళిలకు, దేవాలయాలకు , ఏ ఇతర కార్యములకు ప్రయాణికుల్ని తీసుకొని వెళుతున్నా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# అమరావతికి భూములిచ్చిన రైతు సోదరులు ఆందోళన చెందవద్దు

### రాజధాని పై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు

### స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు విదేశీ ప్రతినిధులు రావాలంటే ఎయిర్ పోర్ట్ అవసరం.

### పరిశ్రమలు వస్తేనే రైతుల భూముల ధరలు నిలుస్తాయి పెరుగుతాయి

### ఎయిర్ పోర్ట్ కోసం భూసేకరణకు బదులు సమీకరణే చేయాలని ఎమ్మెల్యేలు కోరారు.

### రైతులకిచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తాం మీడియాతో మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 16)

రాజధాని కోసం భూములిచ్చిన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. రైతుల త్యాగంతోనే అమరావతి నిర్మాణం చేస్తున్నామన్నారు. అమరావతిపై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని, భూములిచ్చిన రైతులకు ఎలాంటి అనుమానాలు వద్దని బుధవారం స్పష్టం చేశారు. అమరావతిలో ఎయిర్ పోర్ట్ నిర్మాణం, 30 వేల ఎకరాల భూసమీకరణపై రైతులకు మంత్రి మరోసారి క్లారిటీ ఇచ్చారు మంత్రి నారాయణ. అమరావతి నిర్మాణం అంటే కేవలం మౌళిక వసతుల కల్పన మాత్రమే కాదని , జనాభా రావాలన్నా,యువతకు ఉద్యోగాలు రావాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు జరగాలన్నారు. రైతుల భూముల ధరలు నిలవాన్నాధరలు పెరగాలన్నా పరిశ్రమలు ఏర్పాటు ముఖ్యమన్నారు.అమరావతిలో కాలుష్య భరితమైన పరిశ్రమలు కాకుండా స్మార్ట్ ఇండస్ట్రీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు కోసం విదేశీ పెట్టుబడిదారులు అమరావతికి రావల్సి ఉంటుందని,అందుకోసమే ఫ్లైట్ కనెక్టవిటీ ఉండేలా ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు 5వేల ఎకరాల భూమి అవసరం అన్నారు. అయితే దీనికోసం భూసేకరణ చేయాలాల్యాండ్ పూలింగ్ చేయాలా అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పటికే అమరావతిలో 64 వేల కోట్ల పనులకు పరిపాలనా ఆమోదం లభించిందని, చాలా వరకూ టెండర్లు పూర్తయి పనులు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు.

**మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి**

అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు మంత్రి నారాయణ. ఏడాదిలోగా అధికారుల నివాస భవనాలు పూర్తి చేస్తామని, ఏడాదిన్నరలోగా ట్రంక్ రోడ్లు, రెండున్నరేళ్లలో లే అవుట్ రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ భవనాల నిర్మాణాలు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ మరోసారి స్పష్టం చేసారు.

## త్రిపురాంతకేశ్వరుడిని దర్శించుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఏప్రిల్ 16)

శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానము , శ్రీమత్ బాల త్రిపుర సుందరి దేవి అమ్మ వార్ల ఉభయ దేవస్థానములను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, వారి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కృష్ణ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్ విజయోత్సవం







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 16)

కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్ విజయ వంతంగా పూర్తి కావడంతో, బుధవారం కాలేజ్ ప్రాంగణంలో ఘనంగా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి శాఖాధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు , విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఈసీఈ శాఖ ప్రతినిధి మాట్లాడుతూ.. "ఇన్నోవేషన్ అంటే కేవలం సిద్ధాంతాన్ని మాత్రమే కాదు, అనుభవంతో కూడిన పరిష్కారాలను రూపొందించడం. మా విద్యార్థులు ఈ ల్యాబ్ ద్వారా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. యూజర్ అవసరాలను అర్థం చేసుకొని, అనేక సాంకేతిక సమస్యలకు ఆవిష్కరణాత్మక పరిష్కారాలు రూపొందించారు. ఇది ఒక గర్వకారణం" అని పేర్కొన్నారు. ఈ ల్యాబ్‌లో విద్యార్థులు విభిన్నమైన ప్రాజెక్టులపై పనిచేశారు. కొంతమంది విద్యార్థులు స్మార్ట్ హెల్త్ మానిటరింగ్ సిస్టమ్, ఇంకొంతమంది గ్రామీణ మౌలిక వసతులపై ఆధారిత డిజిటల్ సొల్యూషన్లు రూపొందించారు. వారి ఆవిష్కరణలు నూతన ఆలోచనలకు దారితీసేలా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మెంటార్లు తమ మద్దతు , మార్గదర్శకతను అందించి విద్యార్థులను ఉత్తమ మార్గంలో నడిపారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయోత్సవం ఒక ముగింపు కాదు, ఇది ప్రారంభం మాత్రమే అని చివరిగా అందరూ పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

## పొదిలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా ఇమాంసా అధికార ప్రకటన విడుదల

### ఆనందోత్సహాలలో అభిమానులు

### పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తగా గుర్తింపు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 16)

పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ గా ఆర్ఎంపి వైద్యులు, మాజీ ఎంపిటిసి సభ్యులు డాక్టర్ సయ్యద్ ఇమాంసాను ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రకటనను బుధవారం విడుదల చేసింది. 2004లో వార్డు మెంబర్‌గా పోటిచేయగా ఓటమి చెందారు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రజలకు సేవ చేస్తూ చేరువయ్యారు. తదనంతరం 2014 లో ఎంపిటిసి గా అత్యధిక మెజార్టితో గెలుపొందారు. వివాదాలకు దురంగా, సౌమ్యుడిగా,పేదలకు సేవలు అందించడంలో తనకంటు ఒక గుర్తింపు సంపాదించుకున్నారు. పార్టి చేపట్టిన కార్యక్రమీలన్నింటిలో క్రమం తప్పకుండ హాజరుకావడం, ప్రజలలో గుర్తింపు పొందడం, అధిష్టానం చేపట్టిన ఐవిఆర్ఎస్ సర్వేలో ఎక్కువశాతం ఇమాంసాను గుర్తించడంతో పదవి దక్కినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ముఖ్య అనుచరుడుగా ఇమాంసాకు మంచి గుర్తింపు ఉంది. పార్టీని నమ్ముకొని పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తగా ఇమాంసాకు అవకాశం రావడం పట్ల అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు
# ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ

**మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ**
**నియోజకవర్గ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీన పారితోషికం అందిస్తాం**
**విద్యార్థులకు బాస్కెట్ బాల్ కోర్టు ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 16)**

విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు విద్యార్థులకు సూచించారు. కందుకూరు పట్టణంలోని టిఆర్ఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశలు- ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నాం అని ఆయన అన్నారు. గత ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాలను అందించడంలో నిర్లక్ష్యం వహించాయి. మోడల్ స్కూల్స్ విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత మూడు నాలుగు నెలలకే విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడం జరిగేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం చదువుకునే పేదవారి పిల్లలు ఏ ఇబ్బందులూ లేకుండా చదువుకోవాలనే ఉద్దేశంతో ముందుకు పరిపాల సాగిస్తుందని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ నేతృత్వంలో విద్యా రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పాదయాత్ర సమయంలో ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఇంటర్మీడియట్ విద్యార్థులకు మొదటిసారిగా మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత నారా లోకేష్ అని తెలిపారు. పేద విద్యార్థులకు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు అవసరమైన మెటీరియల్, నెట్ గైడెన్స్ అందిస్తామని హామీ ఇచ్చారు. గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు కూడా కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులతో పోటీ పడగలరనే నమ్మకంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మా నియోజకవర్గంలోని మెరిట్ స్టూడెంట్స్‌కు నియోజకవర్గ స్థాయిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీన ప్రోత్సహిస్తూ, కొత్త తరం విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. అనంతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.

బాస్కెట్ బాల్ అసోసియేషన్ దాతల సహకారంతో టి ఆర్ ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టును ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అని టి.ఆర్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగూర్ వలి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగూర్ వలి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్ని రోశయ్య, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, వడ్డెళ్ళ రవిచంద్ర, నాదెళ్ల వెంకట రమణయ్య, గడ్డం మాలకొండయ్య, మర్రిపూడి శ్రీను, ఇతర ముఖ్య నాయకులు కళాశాల సిబ్బంది బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.







## అర్జీలు పరిష్కారాన్ని అధికారులు బాధ్యతగా తీసుకోవాలి

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 16)**

ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. ప్రజల ఇబ్బందులు తీర్చడమే కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యమని, ఆ విషయంలో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. వినుకొండ పట్టణంలోని చీఫ్‌విప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్ సందర్భంగా బుధవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను నేరుగా విన్నా రు. సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునే దిశగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ, డ్రైనేజీ, నీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఎక్కువగా వినతులు వచ్చాయన్నారు. మొత్తం 94 అర్జీలు స్వీకరించామని తెలిపారు. వీటి అన్నింటినీ పరిశీలించి, పరిష్కారాలు సూచించామన్నారు. నీటి సమస్యలు, డ్రైనేజీ బ్లాకేజీపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి భూ రికార్డులు సరిచేయడంపైనా వేగంగా స్పందించాలన్నారు. కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల్లో పల్నాడు ప్రాంత కరవు తీర్చడం ప్రధానంగా ఉందని.. ప్రతి గ్రామంలో సాగునీరు, తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రజల నమ్మకమే కూటమి ప్రభుత్వం బలమని, వారి సమస్యలు పరిష్కరించ డం ద్వారా వినుకొండ నియోజకవర్గం మొత్తాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.

## తొలి ఏకాదశి కి ఘాట్ రోడ్డు పూర్తి చేయాలి

**అధికారులతో సమీక్షించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు**

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 16)**

వినుకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని తొలి ఏకాదశి పండుగ లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. దేవాలయం, ఘాట్ రోడ్డు, గిరిప్రదర్శన రోడ్డు నిర్మాణంపై బుధవారం చీఫ్ విప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూలై 7వ తేదీ జరగబోవు తొలి ఏకాదశి పండుగ భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణానికి 5.90 కోట్లు, గిరి ప్రదర్శన రోడ్డు నిర్మాణానికి 1.20 కోట్లు, రామలింగేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి 2 కోట్లు నిధులు మంజూరు చేయించానని, అలాగే దాతల సహకారంతో 6 నెలల్లో నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను చీఫ్ విప్ జీవి ఆదేశించారు. ఘాట్ రోడ్డు నిర్మాణం గతంలో జరిగిన తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ ప్లానింగ్ లేకుండా ఇష్టానుసారంగా ఘాట్ రోడ్డుకు బ్లాస్టింగ్లు చేయటం వలన కొండచిట్టు రాళ్లు నిలిచి ప్రమాద భరితంగా మారిందన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణంలో ఎటువంటి లోపాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని నాణ్యత ప్రమాణాలతో దేవాలయం, గిరి ప్రదర్శన రోడ్డు, ఘాట్ రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. రోడ్లు, ఆర్టీసీ బస్సు పార్కింగ్, గ్రీనరీ, కరెంటు, త్రాగునీరు తదితర అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించి భక్తుల మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా ఆదేశించారు. రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి వినుకొండ ప్రజల సహాయ సహకారాలు అందించాలని కోరారు. దేవాలయ అభివృద్ధికి త్వరలో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కొండపై మెట్ల మూర్గాన్ని కూడా దాతల సహకారంతో త్వరితగతిన పూర్తి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, జనసేన, బిజెపి నాయకులు, పంచాయతీరాజ్ ఎస్.ఈ బ్రహ్మయ్య, డ్వామా పిడి సిద్ధ లింగమూర్తి, ఆర్ అండ్ బి, పిఆర్, పి ఐ యు, ఆర్డబ్ల్యూఎస్, ఎలక్ట్రిసిటీ డి ఈ లు, ఏఈలు, దేవాదాయ శాఖ డీఈ, ఏఈ లు, ఈవోలు, ఫారెస్ట్, రెవిన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, వార్డు కౌనిసిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.





## సివిల్స్ అభ్యర్థులకు 30 నెలల ఉచిత శిక్షణ
## ఆదివారం ప్రవేశ పరీక్ష

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 16)**

అన్నమాట ప్రకారం సివిల్స్ కోచింగ్ స్కాలర్‌షిప్ అందించే విషయంలో ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కీలక ప్రకటన చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు అందరికీ ఒక ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా 30నెలలపాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నామన్నారు. బుధవారం ఈ మేరకు మీడియాతో మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పూర్తి వివరాలు వెల్లడించారు. వినుకొండలో ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీ, బీసీ మహిళా అభ్యర్థుల్లో ప్రతిభ ఉన్న వారిని 10 మందిని ఎంపిక చేసి శివశక్తి ఫౌండేషన తరపున ఉచితంగా శిక్షణ ఇప్పిం చడం జరుగుతుందన్నారు. వారికి వసతి, భోజనం సహా అన్ని ఏర్పాట్లు ఉచితంగానే చేస్తామన్నారు. ఆదివారం అందుకు సంబంధించిన పరీక్ష నిర్వహిస్తున్నామని వెల్లడిచారు. వినుకొండ పట్టణం కురిచేడు రోడ్డులోని సీతారామపురం ఐనవోలు దగ్గర ఉన్న డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ భవనంలో ఆ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారంతా ఆదివారం పరీక్షకు హాజరు కావొచ్చని తెలిపారు. పరీక్షలో మంచి మార్కులు వచ్చిన వారికి సివిల్స్, గ్రూప్ పరీక్షలకు కావాల్సిన సహకారం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8639379369 అనే నంబర్‌లో సంప్రదించాలని లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ నిర్వాహకులు తెలిపారు.

## భార్యపై అనుమానంతో రోకలి బండతో తలపై బాది హత్య చేసిన భర్త





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 16)**

మండల కేంద్రమైన పామూరులో గల ప్రశాంతి నగర్‌లో నివాసం ఉంటున్న యాసారపు మార్తమ్మ, యాసానపు రమేష్ అను వారు భార్యభర్తలు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే భార్యపై అనుమానం ఉంది. ఈ క్రమంలో ఎలాగైన అంతమొందించాలని ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఈ నెల 13వ తేదిన రోకలి బండతో ఆమె తలపై కొట్టగా ఆమె చనిపోయింది. మృతురాలి అన్న గందం ప్రకాశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పామూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పామూరు సిఐ భీమా నాయక్ కేసు దర్యాప్తు చేపట్టారు. కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో పామూరు సిఐ భీమా నాయక్ త్వరితగతిన కేసును దర్యాప్తు చేసి బుధవారం పరారీలో ఉన్న ముద్దాయిని పామూరు మండలంలోని కొత్తపల్లి గ్రామ జంక్షన్ వద్ద అరెస్టు చేశారు. కేసు త్వరితగతిన ఛేదించిన పామూరు సిఐ భీమా నాయక్, సిబ్బందిని కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కాకాణికి మరో షాక్

సొంత మండలంలోని
పార్టీ కార్యకర్తలను కాపాడు కోలేని కాకాని
ఊరు వదిలి పారిపోవడంతో ఆయనపై
వైసీపీ శ్రేణుల్లో సడలుతున్న నమ్మకం
సొంత మండలం పొదలకూరు నుంచే మొదలైన వైసీపీ నేతల వలసలు
వైసీపీని వీడే యోచనలో కీలక నాయకులు





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 16)**

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు ఇనుకుర్తి సర్పంచ్ పెదమల్లు శ్రీనివాసులు రెడ్డి, నాయకులు పెదమల్లు శేషారెడ్డి, మాలపాటి రమణారెడ్డి, మాలపాటి వెంకటేశ్వర్లు రెడ్డి, శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు చిడదల శేషమ్మ, సూరిపాక రమేష్, ఇండ్ల వెంకటమ్మ తదితరులు. అక్కెం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన 40 కుటుంబాల వారికి ఆత్మీయ ఆహ్వానం పలికారు సోమిరెడ్డి.

## పౌష్టిక ఆహారం పై అవగాహన




**(షణ్ముఖ వెలుగు, కొండపి, ఏప్రిల్ 16)**

శ్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవల లో భాగంగా కొండపి మండలం పేరీదీపి గ్రామంలోలోని అంగనవాడి స్కూల్లో గర్భవతులకు, పిల్లల తల్లులకి పౌష్టిక ఆహారం వాటి విలువలు బిడ్డకు తల్లిపాలు ఇవ్వటం వలన పిల్లలు ఆరోగ్యంగా దృఢంగా మానసిక ఎదుగుదల బాగుంటుందని కొండపి సిడిపిఓ మాధవి లత అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విక్టోరియా రాణి, అంగన్వాడీ టీచర్లు ,పిల్లల తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

# హత్య కేసులోని ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

స్థల వివాదం విషయంలో ఒక వ్యక్తిని కర్రలతో కొట్టి చంపిన ఇద్దరు నిందితులకు ఒంగోలు పిడిఐ కోర్ట్ జడ్జి ఏ భారతి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కేసు వివరాల్లోకి వెళితే మద్దిపాడు మండలం పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన గొట్టిపాటి రామరావు (55) కు సమీప బంధువులైన నల్లూరి వెంకటరావు కుటుంబ సంభ్యులకు నాలుగు గదుల ఖాళీ స్థలం గురించి గత కొన్ని సంవత్సరముల నుండి వివాదం ఉన్నది. సదరు స్థలం విషయంలో ఒకరికి ఒకరు గొడవలు పడుచున్నారు. వెంకటరావు కుటుంబ సభ్యులు రామారావు పై కక్ష పెంచుకొని ఎలాగైనా స్థలం దక్కించుకుందామనే ఉద్దేశంతో 01.10.2018న రామారావు తన ట్రాక్టర్ డ్రైవర్‌తో తన ఖాళీ స్థలంలో కూరగాయల మొక్కలకు పందిరి వేయుటకు కర్రలు పాతుకొనుచుండగా నల్లూరి వెంకట్రావు, నల్లూరి సురేష్, నల్లూరి రాజ్యలక్ష్మిలు రామారావు పై (మృతుడు) కర్రలతో దాడి చేశారు. చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా మైరుగైన చికిత్స నిమిత్తం కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. 03.10.2018న చికిత్స పొందుతూ మరణించిన ఘటనలో మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేయగా అప్పటి ఒంగోలు రూరల్ సీఐ ఓ దుర్గ ప్రసాద్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపించి, కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ వసుంధర ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. పోలీస్ సిబ్బంది సాక్షులను కోర్ట్ లో సమయానుసారం హాజరు పరుస్తూ ప్రకాశం జిల్లా ఎస్పీ గారి మార్గదర్శకత్వంలో పటిష్టమైన గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థవంతంగా విచారణ నడిపి సరైన సాక్ష్యాధారాలతో నిందితుడుపై నేరనిరూపణ చేసినందున బుధవారం న్యాయమూర్తి ఏ భారతి నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.5000లు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నల్లూరి రాజ్యలక్ష్మి పై నేరం రుజువు కానందున ఆమె పై కేసు కొట్టి వేశారు. సదరు కేసులో సరైన సాక్ష్యాధారాలు కోర్ట్ లో ప్రవేశపెట్టి సమర్ధవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేసి నిందితులకు శిక్షించబడటంలో క్రియాశీలక పాత్ర పోషించిన అప్పటి ఒంగోలు రూరల్ సీఐ దుర్గ ప్రసాద్, ప్రస్తుతం సీఐ యన్ శ్రీకాంత్ బాబు, అప్పటి మద్దిపాడు ఎస్ఐ పి సురేష్, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ వి రాఘవరావు, టి మాలకొండయ్య, మద్దిపాడు హెడ్ కానిస్టేబుల్ ఎ మధుసూదనరెడ్డి లను జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

# కార్డన్ సెర్చ్ నిర్వహించిన ప్రకాశం పోలీసులు

## సరైన పత్రాలు లేని 18 మోటార్ సైకిళ్ళు, ఐదు ఆటోలు స్వాధీనం









(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 16)

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మార్కాపురం పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి బుధవారం మార్కాపురంలోని ఏకలవ్య కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్ , సెర్చ్‌లో పోలీస్ లు ఆయా ప్రాంతాలోని అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల ఇళ్లల్లో, గ్రామా శివారులు, ముఖ్యమైన కూడళ్లు, పలు షాప్ లలో డ్రోన్ కెమెరాలతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఐదు ఆటోలు, 18 బైకులు, మొబైల్ ఫోన్స్ మూడు స్వాధీనం చేసుకున్నారు. నేర నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాల అడ్డుకట్టకి పోలీసు శాఖ నిర్వహించే కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమానికి ప్రజలు వంతు సహకారాన్ని అందించాలని పోలీసు అధికారులు కోరారు. వారి ప్రాంతంలో చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112, 100కు తెలియజేయాలని కోరారు. ఈ కార్డన్ సెర్చ్‌లో మార్కాపురం సీఐ పి సుబ్బారావు, మార్కాపురం ఎస్ఐ ఎం రాజ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన కనిగిరి బ్రాహ్మణ సంఘం నాయకులు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 16)



అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పిసిపిల్లి మండలం పడమటి పల్లే గ్రామంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి కనిగిరి బ్రాహ్మణ సంఘం నాయకులు ధూళిపాళ్ల వీరభద్రరావు, ప్రజా హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు , బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు సంగరాజు సాయి మనోజ్, దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గోన దానయ్య అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం నాయకులు ధూళిపాళ్ల వీరభద్రరావు మాట్లాడుతూ అమరజీవి భాషా సంయుక్త రాష్ట్రాల ఉద్యమ నిర్మాత శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా రాష్ట్రాలు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. తెలుగు మాట్లాడే వారి కోసం తెలుగు రాష్ట్రం ఏర్పాటు చేయాలని దీక్ష చేసి తమిళుల తెలుగు వివక్షకు వ్యతిరేకంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేని అన్నారు. ఆయన త్యాగాలను గుర్తించి నేడు రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పొట్టి శ్రీరాములు పడమటి పల్లిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రజా హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జున రావు అన్నారు . పొట్టి శ్రీరాములు పాలేటి పల్లి రిజర్వాయర్ పేరు పెట్టడం జరిగిందన్నారు. పాలేటిపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. కనిగిరిలో ఏర్పాటు చేయనున్న ట్రిబుల్ ఐటీ కాలేజీకి పొట్టి శ్రీరాములు ట్రిబుల్ ఐటీ కాలేజీ గా నామకరణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని యువత ముందుకు నడవాలని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు సంగరాజు సాయిమనోజ్ అన్నారు. పొట్టి శ్రీరాములు స్మారక కేంద్రాన్ని పడమటి పల్లిలో ఏర్పాటు చేయాలని దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గోన దానయ్య కోరారు. అనంతరం పొట్టి శ్రీరాములు నివసించిన ఆయన నివాసాన్ని సందర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు సేవాసంఘం అధ్యక్షులు పేరం నాగ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.








# శ్రీ సీతా సమేత కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 16)

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం కందుకూరు పట్టణ పరిధిలోని దివివారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతా సమేత కోదండరామస్వామి దేవస్థానంలో జరిగిన విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దివివారిపాలెం ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు ఎమ్మెల్యేకి ఆత్మీయ స్వాగతం పలికి శాలువా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.











# ఒంగోలు నగర వీధులు జలమయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

బుధవారం తెల్లవారుజామున 3నుంచి సుమారు 6:30 గంటల వరకు కురిసిన వర్షానికి ఒంగోలు నగరంలో రోడ్లన్నీ జలపాతంలా కనిపించాయి. ట్రంక్ రోడ్డు రిమ్స్ ఎదురు, కర్నూల్ రోడ్ బస్టాండ్ సెంటర్లో, అద్దంకి బస్టాండ్ సెంటర్లో భాగ్యనగర్ 4వ లైన్‌లో భారీగా వర్షపు నీరు నిలవడంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కలిగింది. బస్టాండ్ నుండి వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



